RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 307 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 నవంబర్ 2024 గురువారం పేజీలు : 4

### ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఢిల్లీ వాసులకు కష్టకాలం మొదలైంది. ప్రతి ఏడాది చలికాలంలో ఢిల్లీ వాసులు తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ ఏడాది మరింత ముందుగానే ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. దీపావళి పండుగకు ముందే ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. తాజాగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది చలి తీవ్రత పెరగడం, వాయు వేగం తగ్గడంతో ఢిల్లీ, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాల దహనం వల్ల రాజధాని నగరం ఢిల్లీని పొగ అలిమేస్తోంది. దీంతో రాజధాని ప్రాంత ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# మరో హామీ అమలు దిశగా...!

## రూ. 4 వేల పెన్షన్‌కు ముహూర్తం ఖరారు?

## తెలంగాణ ప్రభుత్వం కసరత్తు..!!



హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాల్లో ఆరు గ్యారంటీలు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉచిత బస్సు మొదలు రైతు భరోసా, ఆసరా పింఛన్ల పెంపు వరకు ఇలా ప్రజలను ఆకట్టుకునే పథకాలతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లింది. మరీ ముఖ్యంగా ఆసర పింఛన్ల పెంపునకు సంబంధించి ప్రజలు బాగా అట్రాక్ట్ అయ్యారని చెప్పొచ్చు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు, సిలిండర్‌పై సబ్సిడీ వంటి గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసింది. అయితే తాజాగా మరో రెండు పథకాలను అమలు చేసేందుకు రేవంత్ సర్కార్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసరా పింఛన్ పెంపుతో పాటు రైతు భరోసాపై త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోన్న నేపథ్యంలో ఇంకా పింఛన్ల పెంపు లేకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది. తాజాగా నిర్వహించిన కులగణన సర్వేలో కూడా ఇదే విషయం స్పష్టమైనట్లు తెలుస్తోంది. ఎన్యూమరేటర్లను ప్రజలు పింఛన్ విషయమై ప్రస్తావిస్తున్నట్లు ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ అందింది. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారే అవకాశాలు ఉన్నట్లు భావిస్తోందని సమాచారం. ఇందులో భాగంగానే రూ. 2 వేలు ఉన్న పెన్షన్‌ను రూ. 4వేలకు, దివ్యాంగులకు రూ. 4 వేలుగా ఉన్న పెన్షన్‌ను రూ. 6 వేలకే పెంచేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఎన్నికల్లోపే పింఛన్ పెంపుతో పాటు, రైతు భరోసా పథకాలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వృద్ధాప్య పింఛన్‌తో పాటు బీడీ కార్మికులకు పింఛన్ పెంచడం, రైతు భరోసా అందించడంతో అటు మహిళలు, ఇటు రైతుల నుంచి తమకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని కాంగ్రెస్ పెద్దలు లెక్కలు వేసుకుంటున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. రైతు భరోసాకు సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్ని ఎకరాల వరకు భరోసా ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం సభలో అభిప్రాయాన్ని సేకరించాలని భావిస్తోంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అన్ని జిల్లాల్లో పర్యటించి, రైతులు, రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన విషయం తెలిసిందే. ఈ వివరాలతో పాటు అసెంబ్లీలో రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ఈ పథకానికి సంబంధించి విధివిధానాలను ప్రకటించాలని చూస్తోంది.



### పోలీసులపై ఆందోళనకారుల దాడి.. దిలావర్‌పూర్‌లో తీవ్ర ఉద్రిక్తత

దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్మల్–భైంసా హైవేపై స్థానికులు రెండో రోజూ ఆందోళన కొనసాగించారు. పురుగుల మందు డబ్బాలతో మహిళలు నిరసనలో పాల్గొన్నారు. కొందరిని ముందస్తు అరెస్ట్ చేయడంతో పోలీసులపై ఆందోళనకారులు దాడి చేశారు. వారి వాహనాలపై రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు పరుగులు తీశారు. ఇథనాల్ పరిశ్రమ అంశాన్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ఆయన రాకపోతే ఇక్కడే పురుగులమందు తాగి చనిపోతామని హెచ్చరించారు.



## పార్లమెంటు వాయిదాల స్టంటు: అదానీ దుమారం



పార్లమెంటు ఉభయ సభల్లోనూ వాయిదాల స్టంటు నడుస్తోంది. ప్రతిపక్ష సభ్యులు అదానీ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టడం.. ఆ వెంటనే రెప్పపాటు కాలం కూడా వెయిట్ చేయకుండానే సభలను వాయిదా వేసేయడం కామన్‌గా మారిపోయింది. గతంలోనూ ఇలానే జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం అటు లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ వాయిదాలే నడిచాయి. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీపై నమోదైన కేసుల వ్యవహారంపై చర్చకు పట్టుబడుతూ.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు లోక్‌సభలో నోటీసులు ఇచ్చాయి. సభ ప్రారంభం అవుతూనే అదానీపై చర్చ కోరుతూ స్పీకర్ ఓం బిర్లాకు విపక్ష సభ్యులు నోటీసులు ఇచ్చారు. అయితే, ఈ నోటీసులను తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించడంతో పాటు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. దీంతో విపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో లేచి నిలబడి బిగ్గరగా నినాదాలు చేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. అయినప్పటికీ సభను సజావుగా నడిపించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించినా.. సభ్యులు శాంతించలేదు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే.. తిరిగి 12 గంటలకు సభ ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్ష సభ్యులు శాంతించకపోవడంతో సభను స్పీకర్ ఓం బిర్లా రేపటికి వాయిదా వేశారు. ఇక, రాజ్యసభలోనూ వాయిదాల పర్వమే నడిచింది. తొలుత ఈ రోజు ఉదయం సభ ప్రారంభం కాగానే చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు పెద్దల సభకు మరింత గౌరవాన్ని, మర్యాదను ఇనుమడింప జేయాలని కోరారు. సభా సంప్రదాయాలను పాటించాలని చైర్మన్ సూచించారు. చైర్మన్ స్థానంలో కూర్చున్న వారు సభను సజావుగా నడిపించాలన్న భావనతో ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. వివాదాలకు, ఆందోళనలకు సమయం కాదని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి నోటీసులను అనుమతించడం లేదని చెప్పారు. నిర్మాణాత్మక విధానంలో చర్చలు చేపట్టాలని, నిబంధనలు పాటించాలని సూచించారు. అయితే, తాము ఇచ్చిన నోటీసులపై చర్చ చేపట్టాలని కోరుతూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో చైర్మన్ ధన్‌ఖడ్ సభను తొలుత ఈ రోజు ఉదయం 11 గంటల 30 నిమిషాల వరకు వాయిదా వేశారు. తిరిగి 11 గంటల 30 నిమిషాలకు సభ ప్రారంభమైన తర్వాత కూడా పలువురు సభ్యులు చర్చకు పట్టుబట్టడంతో పాటు తమ తమ స్థానాల్లో నిలబడి ఆందోళన చేశారు. దీంతో చైర్మన్ సభను రేపు ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మొత్తంగా.. పార్లమెంటు సమావేశాలకు ముందు ఏదో ఒక సమస్య తెరమీదికి రావడం.. దానిపైనే చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సభలు ఒక స్టంటుగా మారిపోయాయన్న వాదన వినిపిస్తుండడం గమనార్హం.

# రగిలిపోతున్న షిండే...



## ముదురిన మహా రాజకీయం!

## '106'తో డేంజర్ బెల్స్!!

మహారాష్ట్రలో కనీ వినీ ఎరగని మెజారిటీ వచ్చింది అని బీజేపీ పెద్దలు సంతోషించే లోపే విషాద పర్వాలు కూడా చోటు చేసుకుంటున్నారు. ఆగ్రహ జ్వాలలు కూడా మిన్నంటుతున్నాయి. నిన్నటిదాకా మహారాష్ట్ర వంటి సంపన్న రాష్ట్రానికి సీఎం గా ఉన్న ఏక్ నాథ్ షిండే తన పదవిని రాజీనామా చేసి గవర్నర్ కి ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉన్నారు. అయితే షిండే ముఖంలో ఏ మాత్రం నవ్వు కనిపించలేదు. లాంచనంగా ఆయన గవర్నర్ తో మాట్లాడి వెళ్ళిపోయారు. ఇంకో వైపు షిండేని సీఎం చేయాల్సిందే అని ఆయన వర్గం ఎమ్మెల్యేలు నినదిస్తున్నారు. మహారాష్ట్రలో ఉత్తమ సీఎం గా షిండే పేరునే జనాలు ఎక్కువగా చెప్పారని ఆయన రెండేళ్ళ ప్రజా రంజక పాలన వల్లనే మహాయుతి కూటమికి ఇన్ని సీట్లు వచ్చాయని చెబుతున్నారు. అయితే మరో వైపు బీజేపీ అధినాయకత్వం దేవేంద్ర ఫడ్నవీస్ ని సీఎం చేయడానికి చూస్తోంది అని అంటున్నారు. దాదాపుగా అది ఖాయమైంది అని అంటున్నారు ఒకటి రెండు రోజులలో దానికి సంబంధించిన ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. ఈ మొత్తం పరిణామాలతో కలత చెందిన ఏక్ నాథ్ షిండే పూర్తి అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. ఆయన ఫుల్ సైలెంట్ అయ్యారు. ఆ మౌనం వెనక ఏముంది అన్నది ఎవరికీ తెలియడం లేదు. మొత్తం 57 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న షిండే రగిలిపోతున్నారని అంటున్నారు. అది మహా సంక్షోభానికి దారి తీస్తుందా అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. అయితే షిండేకి కేంద్ర మంత్రి పదవిని ఆఫర్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆయన దానికి ససేమిరా అంటున్నారని భోగట్టా. ఇక రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతాను అని అంటున్నారు. అయితే ఆయనకు దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి చేసి ఉప ముఖ్యమంత్రి పదవి ఏమిటి అని ఆయన అనుచరులు మండిపడుతున్నారు అయితే గతంలో దేవేంద్ర ఫడ్నవీస్ ఈ విధంగా సీఎం గా చేసి డిప్యూటీ సీఎం చేశారు కదా అని గుర్తు చేస్తున్నారు. అయితే మహారాష్ట్రలో ఎంతో బలంతో పాటు సామాజిక వర్గం దన్ను ఉన్న షిండే ఈ ఆఫర్లను అంగీకరించడం లేదని అంటున్నారు. ఆయన సీఎం పదవినే కోరుకుంటున్నారు అని అంటున్నారు ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి ఎవరనేది బీజేపీ హై కమాండ్ తేల్చడంలేదని అంటున్నారు. దాంతో ఆ సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. ఇవన్నీ పక్కన పెడితే షిండే విషయంలో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే కీలకమైన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధినాయకత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ దేవేంద్ర ఫడ్నవిస్ నే ముఖ్యమంత్రిని చేస్తుందని ఆయన కుండబద్ధలు కొట్టారు. దీంతో ఈ విషయం మీద ఏక్ నాథ్ షిండే సంతోషంగా లేరని చెప్పారు. ఆయన పూర్తిగా అసంతృప్తితో ఉన్నారని అందువల్ల దానిని తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అదే సమయంలో వర్తమాన రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుని దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలో పనిచేసే విషయంపై షిండే ఆలోచించాలని కూడా కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే సూచించారు. మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆయన అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే షిండే దగ్గర 57 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మహా వికాస్ అఘాడీ వద్ద 49 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ రెండు కలిస్తే 106 నంబర్ అవుతుంది. ఇది రాజకీయంగా పెద్ద నంబరే. ఈ రోజుకు కాకపోయినా రేపు అయినా ఈ నంబర్ తో డేంజరే. అందువల్ల విపక్షం వైపుగా షిండే మళ్లకుండా బీజేపీ హైకమాండ్ అన్ని రకాలుగా ఆలోచించాల్సి ఉందని అంటున్నారు

## సంపాదకీయం

### ఢిల్లీ ప్రజల ఊపిరితిత్తులు ఆ స్థాయిలో నాశనమయ్యాయా?

ఢిల్లీలో కాలుష్య పరిస్థితులపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) అతి తీవ్ర స్థాయికి చేరుకోవడంతో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో ఢిల్లీలో ఒక్క రోజు గాలి పీలిస్తే 45 సిగరెట్లు కాల్చినదానితో సమానం అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీంతో... స్కూలు పిల్లలకు ఆన్ లైన్ క్లాసులు.. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ పరిస్థితులు ఎదురయ్యాయి. మరోపక్క శ్వాసకోస సంబంధ సమస్యలు ఉన్నవారు ఏమాత్రం బయటకు రాకూడదనే హెచ్చరికలూ జారీ అయ్యాయని చెబుతున్నారు. ఈ సమయంలో షాకింగ్ వివరాలు వెల్లడించారు పరిశోధకులు, డీన్ అనురాగ్ అగర్వాల్. అవును... అశోకా యూనివర్సిటీలోని బయోసైన్సెస్ అండ్ హెల్త్ రీసెర్చ్ డీన్ అనురాగ్ అగర్వాల్ తాజాగా ఢిల్లీలోని వాతావరణ పరిస్థితులు, ప్రజల ఆరోగ్యంపై దాని ప్రభావంపై స్పందించారు. ఈ సందర్భంగా.. ప్రాణాంతకమైన పొగమంచు ఢిల్లీలోని ప్రతీ పౌరుడి ఊపిరితుత్తులకు హాని కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో... ఢిల్లీలో ప్రజల ఊపిరితిత్తులు ఎంతో కొంత మేర కచ్చితంగా నాశనం అయ్యి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు మరింత తీవ్రంగా ఇబ్బంది పడతారని అన్నారు. ప్రధానంగా ఆస్తమా, ఇన్ ఫెక్షన్లు ఉన్నవారి సమస్య వర్ణనాతీతంగా ఉంటాయని తెలిపారు. అత్యంత సవాలుగా ఉండే వ్యాధులు ఆస్తమా, హైపర్ టెన్షన్, శ్వాసకోశ ఇన్ ఫెక్షన్ తో పాటు గుండెపోటుల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని.. ఇదే సమయంలో మధుమేహం, చిత్తవైకల్యం, క్యాన్సర్ ను వేగవంతం చేయడం వంటివాటికి ఈ వాతావరణ పరిస్థితులు కారణమవుతాయని వెల్లడించారు. ఇక ఈ సమస్యకు ఎయిర్ ప్యూరిఫైయర్లు పాక్షికంగా సహాయపడగలవని చెప్పిన అగర్వాల్... అవి దీర్ఘకాలిక పరిష్కారం మాత్రం కాలేవని తేల్చి చెప్పారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ఇళ్లు, పని ప్రదేశాల్లో వీటిని అమర్చుకోవాలని తెలిపారు. ఈ విషయంలో.. ప్యూరిఫయర్లను కొనుగోలు చేయలేని ప్రజలకు ప్రభుత్వాలు సాయం చేయాలని కోరారు!

# వైద్య విద్య.. మరింత చేరువ



తాండూరు: జిల్లా వాసులకు వైద్య విద్య, తదనంతర సేవలు మరింత చేరువకానున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం, తాండూరు పట్టణాల్లో జిల్లా ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. వీటికి తోడు జిల్లాకు మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణం పూర్తయితే స్థానికులకు మరింత నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. బయటి పేషెంట్లు వచ్చి చికిత్సలు చేసుకునే అవకాశం లభిస్తుంది. వీరిలో కొందరికి కొన్ని సందర్భాల్లో చిన్నపాటి శస్త్రచికిత్సలను కూడా చేయాల్సి ఉంటుంది. ప్రొఫెసర్లు శస్త్రచికిత్సలు చేస్తూనే వైద్య విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు మెలకువలు వివరిస్తారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు కూడా అత్యవసర వైద్య సేవలు అందుతాయి.తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు: జిల్లాలో వికారాబాద్, కొడంగల్‌కు వైద్య కళాశాలలు మంజూరైన విషయం విదితమే.. వికారాబాద్‌లో పనులు ప్రారంభమైతే కొడంగల్‌లోని అప్పాయిపల్లిలో భూసేకరణ పూర్తయింది. పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచే పనిలో నిమగ్నమైంది. ఇదే సమయంలో తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. తాండూరులో ఇప్పటికే కళాశాలకు సంబంధించిన భవన నిర్మాణం జరుగుతోంది.

టెండర్లు పూర్తి కాగానే పనులు

శ్రీధర్‌రెడ్డి, జిల్లా రహదారులు, భవనాల శాఖ ఈఈ, వికారాబాద్

కొడంగల్‌లో కళాశాలల నిర్మాణాలకు భూసేకరణ పూర్తయింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు శరవేగంగా జరుగుతాయి. వికారాబాద్‌లో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.

ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి

లక్ష్మీనారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ డీఈ, వికారాబాద్

తాండూరులో చేపడుతున్న నర్సింగ్ కళాశాల నిర్మాణాన్ని ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి చేస్తాం. పనులు పూర్తి కాగానే సంబంధిత అధికారులకు భవనాన్ని అప్పగిస్తాం.

కళాశాలల భవనాలకు నిధుల మంజూరు (రూ.కోట్లలో)

వికారాబాద్ వైద్య : 235

కొడంగల్ వైద్య : 124.5

కొడంగల్ నర్సింగ్ : 46 తాండూరు నర్సింగ్: 25 కొడంగల్ పారామెడికల్, ఫిజియోథెరఫీ : 27

# ఇంధనం కొరత.. నీటి సరఫరా నిలిపివేత



కరీంనగర్ : మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రికలో సాంకేతిక సమస్య ఏర్పడింది. మరమ్మతులు చేయడంలో ఆలస్యం జరగగా ఉదయం 7 గంటలకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. నాలుగు గంటలపాటు కరెంటు లేకపోవడంతో పక్కనే ఉన్న జనరేటర్‌ను నడిపించాల్సి ఉండగా నడిపించలేదు. అయిదు గంటలు ఆలస్యంగా నీటి సరఫరా ప్రారంభించారు.

వరకు అదే నియంత్రికపై రెండుసార్లు సీటీబీటీ కాలిపోయింది. 12 గంటలపాటు విద్యుత్తు అంతరాయం కలగక నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ఎగువ ప్రాంతంలోని అత్యధిక డివిజన్లకు నీటి సరఫరా నిలిపివేశారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్తు సరఫరాలో సాంకేతిక సమస్యలు నీటి సరఫరాపై ప్రభావం పడుతుండటంతో నగరవాసులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దసరా, బతుకమ్మ పండగ తెల్లవారి నుంచే నీటికి కటకట ఏర్పడటం, తాగేందుకు నీళ్లు లేక డబ్బాలు పట్టుకొని రిజర్వాయర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. లోలెవల్ పరిధిలో పాత నీటిశుద్ధి కేంద్రం నుంచి నీటిని పంపిణీ చేస్తుండగా, హైలెవల్ జోన్‌కు మిషన్ భగీరథ శుద్ధి కేంద్రం నుంచి పంపింగ్ చేస్తున్నారు.

వినియోగించుకోని సౌకర్యాలు

నగరంలో విద్యుత్తు అంతరాయం తరచూ ఉంటుంది. పలు కారణాలతో గంటల కొద్ది నిలిపివేస్తుండగా ఆ సమయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు రెండు ఫిల్టర్‌బెడ్లు, రెండు ప్రధాన రిజర్వాయర్ల దగ్గర జనరేటర్ల సౌకర్యాలు కల్పించారు. జ్యోతినగర్ రిజర్వాయర్ దగ్గర నిరంతర విద్యుత్తు సౌకర్యం కూడా ఉంది. జనరేటర్లు నడవాలంటే డీజిల్ తప్పనిసరిగా నిల్వ ఉంచుకోవాలి. కనీసం మూడు గంటలు నడిచేలా నిల్వ ఉంచుకోవాల్సిన ఉండగా ఈ మధ్య బిల్లుల భారంతో పట్టనట్లుగా ఉంటున్నారు. మిషన్ భగీరథలోని జనరేటర్ నడవాలంటే గంటకు 150-200 లీటర్ల డీజిల్ అవసరముంటుంది. అందులో ఎప్పటికి 200 లీటర్లు నిల్వ ఉంచాలి. సామర్థ్యం మేరకు డీజిల్ లేకపోవడంతో మంగళవారం వేకువజామున నడిపించకుండా వదిలేశారు. చివరకు ఉదయం 11.30 గంటలకు డ్రమ్ముల్లో తీసుకొచ్చి పోశారు. మిగతా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుండటంతోనే తరచూ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అధికారులు పట్టించుకోవడంలేదని పాలకవర్గ సభ్యులు ఆగ్రహిస్తున్నారు. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం వస్తోందని, జనరేటర్ ద్వారా పంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని డీఈఈ లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

రెండు రోజులుగా ఇబ్బందులు

నగరంలోని ఎగువ ప్రాంతంలోని విద్యానగర్, రాంనగర్, అంబేద్కర్‌నగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లోని ఏడు రిజర్వాయర్లకు జ్యోతినగర్ రిజర్వాయర్ నుంచి నీటిని పంపింగ్ చేస్తున్నారు. రెండు రోజులుగా రిజర్వాయర్లకు సకాలంలో నీరు చేరకపోవడంతో పంపిణీ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నీటిశుద్ధి కేంద్రం నుంచి శుద్ధజలం రాకపోవడంతో వీధుల్లో సరఫరా సమయాలు మారిపోతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు నిలిచిపోగా, వేకువజాము నుంచి అయిదు గంటలు ఆపేయడంతో దీని ప్రభావం డివిజన్ల నీటి పంపిణీపై పడింది. ఉదయం 10 గంటలకు నీటి సరఫరా చేయాల్సిన ప్రాంతాలకు సాయంత్రం 4.30 గంటలకు నల్లా నీరు ఇచ్చారు. ఇలా సమయపాలన పూర్తిగా మారిపోయి అర్ధరాత్రి వరకు నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఆ ప్రతిపాదనకు పదేళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట స్వయంభూ క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ తలంపునకు నాటికి పదేళ్లు నిండనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో యాదాద్రిగా పేరు మార్చి అరెకరంలోని దేవాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి సంపూర్ణంగా కృష్ణశిలతో ఆవిష్కృతం చేశారు. ఆలయంతో పాటు ఇతర వనరులతో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.1200 కోట్ల ఖర్చైనట్లు వైటీడీఏ చెబుతోంది.

రాష్ట్ర సాధనకు ఉద్యమిస్తున్న దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్ర సందర్శించారు. ఆలయాన్ని విశ్వఖ్యాతి గాంచేలా పునర్నిర్మించాలని తలచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న వెల్లడించారు. కొండకింది పెద్దగుట్ట పై సేకరించిన 850 ఎకరాలో లేఅవుట్ పనులతో విశాల రహదారులు, హరితమయ ప్రాంగణాలు, కాటేజీల నిర్మాణానికి ప్లాట్ల ఏర్పాటుతో 250 ఎకరాలు రూపుదిద్దుకున్నాయి.కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వనరులతో ఆధ్యాత్మిక వాడగా రూపొందింది. సమీపాన చిన్న కొండ పై వీఐపీల బస కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి నిర్మించారు. కళ్యాణ కట్ట, వ్రత



మండపం, అన్న ప్రసాదం అందించే సముదాయం, ఆర్టీసీ బస్టేషన్ నిర్మించారు.కొత్తగా కొండపైన భక్తులు నిద్ర చేసేందుకు డార్మిటరీ హాల్, గుండంలో సంకల్ప స్నానం, ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం నిర్వహిస్తోంది.దేవాలయ విమానం స్వర్ణమయం రూపకల్పనకు ఈ మధ్యే శ్రీకారం చుట్టారు. 60 కేజీల బంగారంతో స్వర్ణవిమానం రూపకల్పనకు ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో, స్థానిక ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యాన యాదాద్రి దేవస్థానం సదరు పనులకు నడుం బిగించిన విషయం తెలిసిందే.

# అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..

ఆలేరు : విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు అవసరం అవుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలామంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.

ఉన్నత విద్య కోసం...ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళుతున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పని సరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్‌ను తీసుకుంటున్నారు.

లెర్నింగ్ లైసెన్స్ మాదిరిగానే..

రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

వీసాను జతచేయాలి..

అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికైతే వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్యపరంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్లోనే చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్‌ను జారీ చేస్తారు.నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.

అమెరికాలో ఇలా...

అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాల్సి ఉంటుంది. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించేప్పుడు పక్కన ఎంవీఐ కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన చోదనను పరిశీలించడంతో పాటు ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసేప్పుడు పొరపాట్లు చేస్తే వాటిని రుజువులుగా చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

# యూరియా.. ఎందుకు అమ్మడం లే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటల సాగుకు వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. వీటిని గరిష్ఠ చిల్లర (ఎమ్మార్పీ) ధరకు లభ్యమయ్యే ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో రైతులు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. పీఏసీఎస్‌లలో అన్ని రకాల ఎరువులు విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు సీఈవోలు పట్టించుకోవడం లేదు. దీంతో దూరంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అధిక ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలతో పాటు రవాణా ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు.

ఉచిత రవాణా సౌకర్యం ఉన్నా..

సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 115 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. ఈ సంఘాలకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులను ఉచితంగా రవాణా చేస్తారు. ఈ అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో 22 సహకార సంఘాల వారు యూరియా తీసుకొచ్చి విక్రయించడం లేదు. దీంతో ఆ సంఘాల పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా విక్రయించాలంటే వారే రవాణా ఖర్చులు భరించి దుకాణానికి తెచ్చుకోవాలి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.



కారణాలు ఇలా..గోదాము లేకపోవడంతో ఎరువులకు స్థలం దొరక్క పీఏసీఎస్ నిర్వాహకులు నిల్వ చ్టేసుకోవడం లేదు.

యూరియా విక్రయించేందుకు, దిగుమతి, ఎగుమతి నిల్వ వివరాలు రాసుకునే సిబ్బంది, హమాలీలు లేకపోవడం.

ప్రభుత్వం నుంచే సరైన (దొడ్డు రకం) యూరియా సరఫరా కాకపోవడం.

కమీషన్‌పైనే దృష్టి

అన్ని సంఘాల్లో డీఏపీ, 20-20, భారత్, ఐఎఫ్ఎఫ్‌సీవో, తదితర ఎరువులను విక్రయించాల్సి ఉంది. కానీ, ఇచ్చిన ఎరువులు మాత్రమే తీసుకోవాలని రైతులకు నిబంధన పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే రూ.కోట్లు కమీషన్ తీసుకుంటున్న సహకార సంఘాల నిర్వాహకులు యూరియా సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విక్రయించాలని ఆదేశించాం - పద్మ, డీసీవో, సూర్యాపేట

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు విక్రయించాలని ఆదేశించాం. కొన్ని సంఘాల్లో విక్రయించడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే వాటిని తనిఖీ చేసి అందుకు గల కారణాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వచ్చే యాసంగిలో అన్ని సహకార సంఘాల్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# చదువుకు విఘాతం.. భవిత అగాధం

గోదావరిఖని: కళాశాలల్లో ర్యాగింగ్ భూతం మళ్లీ జడలు విప్పుతోంది. సోదర భావంతో ఉంటూ చదువుపై దృష్టి సారించాల్సిన యువత సహచరులను వేధిస్తుండటం భవిష్యత్తుకు విఘాతంగా మారుతోంది. బాధితులు మానసికంగా కుంగిపోతుండగా కారకులు కెరీర్‌పరంగా నష్టపోతున్నారు. ర్యాగింగ్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు అమలు చేస్తే ఈ జాడ్యాన్ని రూపుమాపే అవకాశం ఉంది. ఇటీవల ఖమ్మం వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థి జుత్తు సరిగ్గా లేదని సీనియర్లు హేళన చేశారు. అతడు క్షవరం చేయించుకున్నా వదలకుండా వేధించారు. బాధితుడు కళాశాలలోని యాంటీ ర్యాగింగ్ ఇన్‌ఛార్జి దృష్టికి తీసుకెళ్లగా మందలించాల్సింది పోయి ఆయన విద్యార్థికి గుండు కొట్టించాడు.


మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థితో సీనియర్లు అనుచితంగా ప్రవర్తించారు. బాధితుడు తల్లిదండ్రులకు చెప్పడంతో కళాశాలలో ఫిర్యాదు చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10 మందిని 20 రోజుల పాటు తరగతులకు హాజరు కావొద్దంటూ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

**ముందుగా గుర్తించక అనర్థాలు**

ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్, వైద్య, డిగ్రీ, పీజీ కళాశాలలు 124 ఉండగా మొత్తం 73,785 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులతో పాటు వసతిగృహాల్లో ర్యాగింగ్‌కు ఆస్కారముంది. విద్యార్థుల్లో కొందరు ఆకతాయిలుంటారు. వీరు జూనియర్లతో అసభ్యంగా ప్రవర్తిస్తారు. ఈ ప్రభావాన్ని ముందుగా గుర్తించకపోవడం వల్ల అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. ర్యాగింగ్ నిరోధానికి ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేస్తుండగా వీటితో భవిష్యత్తు దెబ్బతింటుందన్న విషయమై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగించాలి.

**ప్రవేశ సమయంలోనే హామీ పత్రం**

విద్యాసంస్థలో ప్రవేశ సమయంలోనే విద్యార్థితో హామీ పత్రం రాయించుకుంటారు. అఫిడవిట్‌లో తల్లిదండ్రులు, సంరక్షకులు, విద్యార్థి సంతకం తీసుకుంటారు. సహచరులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ర్యాగింగ్




చేయబోనంటూ ముందుగానే హామీ తీసుకుంటారు.

**నిబంధనలేం చెబుతున్నాయి?**

కళాశాలల్లో ర్యాగింగ్ నివారణకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2009లో కఠిన నిబంధనలు రూపొందించింది. ఈ మేరకు ర్యాగింగ్‌కు పాల్పడే వారికి కఠిన శిక్షలుంటాయి. మరోవైపు ర్యాగింగ్‌ను గుర్తించదగిన నేరంగా సుప్రీంకోర్టు పరిగణించింది. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి స్క్వాడ్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

**మొక్కుబడిగా నిరోధక కమిటీలు**

ప్రతి విద్యాసంస్థలో ర్యాగింగ్ నిరోధక కమిటీ తప్పనిసరిగా వేయాలి. సంస్థ అధిపతి, పౌర, పోలీసు, సుపరిపాలన, మీడియా, యువజన కార్యకలాపాల్లో పాల్గొనే ప్రభుత్వేతర సంస్థలు, అధ్యాపక ప్రతినిధులు, తల్లిదండ్రుల ప్రతినిధులు, ఫ్రెషర్స్‌కు చెందిన విద్యార్థి ప్రతినిధులు ఇందులో ఉండాలి. కమిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ వల్ల దుష్ఫలితాలు, భవిష్యత్తుపై ప్రభావాన్ని విద్యార్థులకు వివరించాలి. అయితే చాలా చోట్ల కమిటీలు కాగితాలకే పరిమితమయ్యాయి. కొన్ని కళాశాలల్లో మాత్రమే అవగాహన కల్పిస్తున్నారు.

ర్యాగింగ్ నిరోధక చర్యల్లో విఫలమైన విద్యా సంస్థలకు భారీగా జరిమానా విధించే అవకాశం ఉంటుంది. నిబంధనలు పాటించని వాటికి గ్రాంట్లు, నిధులు నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

**తప్పదు భారీ మూల్యం**

ర్యాగింగ్‌కు పాల్పడే వారికి రూ.2.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు.గదిలో బంధిస్తే ఏడాది జైలు శిక్ష.

తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి జీవిత ఖైదు వరకు కఠిన కారాగార శిక్ష ఉంటుంది.ఉపకార వేతనాలు నిలిపివేస్తారు.

ఆయుధాలు వినియోగించి గాయపరిస్తే మూడేళ్ల జైలు.

భౌతిక దాడికి పాల్పడినా, విద్యార్థికి హాని కలిగించినా ఏడాది పాటు జైలు.ర్యాగింగ్‌కు కారకుడైన విద్యార్థి అడ్మిషన్ రద్దుతో పాటు కళాశాల నుంచి బహిష్కరిస్తారు.

ఇతర కళాశాలల్లో చేరే అవకాశం ఉండదు.

విద్యార్థికి ప్రాణహాని కలిగిస్తే పదేళ్ల జైలు శిక్ష.

పోలీసు కేసు నమోదు చేస్తారు.

ఇవి ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయి

మాటలు, రాతల రూపంలో వికృత చేష్టలు.

అనాగరిక, అమానుష ప్రవర్తన.

శారీరక, మానసిక, లైంగిక వేధింపులు.

అసభ్యకర మాటలు, చర్యలు.

మనోభావాలను దెబ్బతీసేలా హేళన చేయడం.


పెరిగిన వాతావరణంతోనే ఇలా..

స్రవంతి, మానసిక వైద్య నిపుణురాలు

పిల్లలు పెరిగే పరిస్థితులు వారిని ప్రభావితం చేస్తాయి. ఆప్యాయత, అనురాగాలతో పెంచితేనే వారి ప్రవర్తన సక్రమంగా ఉంటుంది. ర్యాగింగ్‌కు పాల్పడే వారిలో ఎక్కువ శాతం చిన్నతనంలో కుటుంబంలో సరైన ఆదరణ లేని వారే అయి ఉంటారు. తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం, ఒంటరిగా వదిలేయడం.. వంటి పరిస్థితుల్లో పెరిగిన వారు బయటి ప్రపంచంలోకి రాగానే తమలోని కోపాన్ని ఇలా బయట పెడుతుంటారు. ఎదుటి వాళ్లను ఏడిపించడం ద్వారా ఆనందం పొందుతారు. ర్యాగింగ్ బారిన పడిన విద్యార్థులు మానసికంగా కుంగిపోతారు. భయం నుంచి తేరుకుని చదువుపై దృష్టి సారించేందుకు సమయం పడుతుంది. జీవితాన్నే కోల్పోతారు జాగ్రత్త!

ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీసు కమిషనర్ఉన్నత భవిష్యత్తు లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలి. ర్యాగింగ్‌కు శిక్షలు కఠినంగా ఉన్నందున జీవితాన్ని కోల్పోతారు. ఆకతాయితనంతో జూనియర్లను ఇబ్బందులకు గురి చేస్తే చేజేతులా బంగారు భవిష్యత్తును పాడు చేసుకున్నట్లే. ర్యాగింగ్ నిరోధానికి విద్యా సంస్థల్లో అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు దీనికి దూరంగా ఉండటమే అన్ని విధాలా మేలు.

# గళం విప్పితేనే.. 'నిధి'



తాండూరు : పార్లమెంట్ సమావేశాలంటే దేశ వ్యాప్తంగా అందరి దృష్టి ఉంటుంది. ఎంపీలు తమ ప్రాంతాల సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు చూపాలని ప్రజలు ఆశిస్తారు. స్థానిక ఎంపీలకు విన్నవిస్తారు. మన వికారాబాద్ జిల్లాకు సంబంధించి వికారాబాద్, తాండూరు, పరిగి నియోజక వర్గాలకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కొడంగల్‌కు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రాతినిథ్యం వహిస్తున్నారు. నేటినుంచి శీతాకాల పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎంపీలు చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

**దశాబ్దాల కలగానే వికారాబాద్- కృష్ణ నూతన రైలు మార్గం**

వికారాబాద్- కృష్ణా రైల్వే మార్గం నాలుగు దశాబ్దాలుగా అమలుకు నోచుకోవడం లేదు. 2011 నవంబరులో వికారాబాద్- కృష్ణా రైలు మార్గంపై కేంద్రం సర్వేలు నిర్వహించింది. 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అవసరమైన భూమిని రైల్వేశాఖకు సమకూరుస్తామని చెప్పారు. వికారాబాద్- కృష్ణా నూతన రైలు మార్గం వికారాబాద్ నుంచి పరిగి మీదుగా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్, కోస్గి, హుస్నాబాద్, నారాయణపేట జిల్లా కేంద్రం మీదుగా మక్తల్ రైలు మార్గంలో కలుపుతారు. దీనివల్ల రాకపోకలు సులువు అవుతాయి. కొత్త రైలు మార్గాన్ని రూ.2,196 కోట్ల వ్యయంతో 122 కి.మీ. పొడవునా నిర్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో రూ.2,196 కోట్ల వ్యయం చేయనున్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కొద్ది నెలల క్రితమే వెల్లడించారు.

వికారాబాద్ పట్టణంలో ఉన్న రైల్వే వంతెన ఇరుకుగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ వంతెన విస్తరణకు గత ప్రభుత్వం రూ.96 కోట్లు మంజూరు చేసినా నేటికీ పనులు ఊపందుకోలేదు.

**కంది బోర్డు ఏర్పాటు ఇంకెప్పుడు..**

తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే తాండూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు.రోడ్ల మరమ్మతులు, జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరం చేయాల్సి ఉంది.


**పర్యాటకం.. అభివృద్ధిచేస్తేనే లాభం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అనంతగిరి పర్యాటక అభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లు గతంలో ప్రకటించారు. ఎకో పార్కునూ ప్రారంభించలేదు. ఇతర అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.

**కేంద్ర నిధుల మంజూరుకు కృషి చేస్తా**

జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలు తెలుసు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయించి సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించా. పార్లమెంటులో జిల్లా సమస్యలపై ప్రస్తావించి, సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తా.కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు, చేవెళ్ల.

# సర్వే సమగ్రం..వివరాలు నిక్షిప్తం



పాత తాండూరు : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఉపాధ్యాయులు, సర్వే సిబ్బంది ఇంటింటికి తిరిగి రాసుకున్న దస్త్రాలను మండల పరిషత్ కార్యాలయానికి అప్పగించారు. కార్యాలయంలో అధికారులు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసేందుకు ఉన్న ఆపరేటర్లతో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో కొన్నిచోట్ల ప్రారంభం కాగా, మరికొన్ని చోట్ల నేటి నుంచి ఆరంభమవుతోంది.

**అధికారికి ప్రత్యేక బాధ్యతల అప్పగింత**

ప్రభుత్వం ఈ నెల 6 నుంచి సమగ్ర కుల గణన సర్వే ప్రారంభించగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 75శాతం మేర పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు సర్వే చేసిన పత్రాలను పర్యవేక్షకుల ద్వారా మండల పరిషత్ కార్యాలయాలకు అప్పగిస్తున్నారు. తప్పులు లేకుండా, పక్కాగా కంప్యూటర్‌లో నమోదు జరిగేలా ఆయా పరిషత్ కార్యాలయాల్లో ఒక అధికారిగా బాధ్యతలు అప్పగించారు.

**విద్యాశాఖ కంప్యూటర్ల వినియోగం**

పంచాయతీలు, ఉపాధి హామీ, మండల పరిషత్ కార్యాలయాలోని కంప్యూటర్లతోపాటు కొత్తగా విద్యాశాఖకు మంజూరైన కంప్యూటర్లను ఆన్‌లైన్ నమోదుకు వినియోగిస్తున్నారు. ఒక్కో మండలంలో విద్యాశాఖకు చెందిన కంప్యూటర్లు 5-8 వరకు తీసుకొని వాడుకుంటున్నారు. తాండూరు మండల పరిధిలో వీరారెడ్డిపల్లి, జినగుర్తి, అంతారంతండా, చింతామణిపట్నం, అల్లాపూర్‌లో శత శాతం సర్వే పూర్తికావడంతో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

జిల్లాలో సర్వే చేపట్టిన కుటుంబాలు..

20 మండలాల్లో.. 2,33,588

నాలుగు నియోజకవర్గాల్లో: 2,77,977

నాలుగు మున్సిపాలిటీల్లో .. 44,3,86

**మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలి**

దుద్యాల మండల కేంద్రం నూతనంగా ఏర్పాటైనా మండల పరిషత్‌కు సంబంధించిన కార్యకలాపాలు ఉమ్మడి మండలంలోనే కొనసాగుతున్నాయి. దుద్యాల మండల కేంద్రంలో తగిన యంత్రాంగం, కంప్యూటర్లు, దస్త్రాలను భద్రపరిచే స్థలం లేకపోవడంతో వివరాల నమోదుకు బొంరాస్‌పేటకు వెళ్లాల్సి రావడం ఎన్యూమరేటర్లకు ఆందోళనకు గురి చేస్తోంది. దాదాపు దుద్యాల నుంచి 20కి.మీ. దూరం వెళ్లి డేటా ఎంట్రీ చేయాలంటే ఇబ్బందిగా ఉంటోందన్నారు. మండల కేంద్రంలోనే సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్యూమరేటర్లు కోరుతున్నారు.

# అవిశ్రాంత పోరు.. ఆదుకునేనా సర్కారు

తాండూరు : దశాబ్దాలు పనిచేసి ఉద్యోగ విరమణ చేశాక ప్రశాంత జీవనం సాగించాలన్న కార్మికుల కలలు ఆవిరయ్యాయి. తమకు చెల్లించాల్సిన సొమ్మును ఏళ్ల తరబడి చెల్లించకుండా కాలయాపన చేశారు. న్యాయబద్ధంగా రావాల్సిన సొమ్మును పొందేందుకు కర్మాగారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఫలితం లేకపోవడంతో కేంద్ర కార్మిక శాఖ అధికారులను ఆశ్రయించారు. అధికారులు జోక్యం చేసుకోవడంతో కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు పూర్తి న్యాయం చేయాలని కోరుతున్న కార్మికుల స్థితిగతులపై కథనం.

**ప్రభుత్వ సిమెంట్ కర్మాగారమైనా..**

తాండూరు మండలం కరణ్‌కోటలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారం కొనసాగుతోంది. దీన్లో 400మంది ఒప్పంద కార్మికులు రాత్రి పగలు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఏటా కొంత మంది ఉద్యోగ విరమణ చేస్తుంటారు. వీరందరికి గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలు ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉన్నా ఏళ్లుగా ఇవ్వడంలేదు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.4.50లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 30 మంది కార్మికులు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు డెత్ డిపాజిట్ లైన్ ఇన్స్యూరెన్స్ (ఈడీఎల్ఐ) కింద ఒక్కొక్కరికి రూ.7.50ల చొప్పున చెల్లించాల్సి ఉంది.

గుత్తేదారుల జేబుల్లోకి 4 సంవత్సరాల పీఎఫ్ సొమ్ము: కార్మికుల వేతనంలోంచి నెలనెలా 12 శాతం (కార్మికుల వేతనాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ.3,500) సొమ్మును పొందారు. దాన్ని పీఎఫ్ ఖాతాలో జమ చేయాల్సి ఉండగా గుత్తేదారులు సొంతానికి వాడుకున్నారు. 4 సంవత్సరాలుగా పీఎఫ్ సొమ్మును దుర్వినియోగం చేశారు. ఇటీవల గుర్తించిన కార్మికులు కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా కర్మాగారానికి చేరుకొని విచారణ చేశారు. నెలరోజుల్లోగా కార్మికులందరి పీఎఫ్ సొమ్మును ఖాతాల్లో జమ చేయించేందుకు చర్యలు చేపడతామని అధికారుల బృందం వారికి హామీ ఇచ్చింది. దీన్ని వెంటనే నెరవేర్చడంతోపాటు తమకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు.

కార్మిక శాఖ అధికారులపై ఆశలు నెల క్రితం కార్మికులు తమకు గ్రాట్యుటీ, బీమా సొమ్మును సంవత్సరాలుగా చెల్లించడం లేదంటూ హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ అధికారులను ఆశ్రయించి మొరపెట్టుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన కార్మిక శాఖ అధికారులు కర్మాగార ప్రతినిధులతో చర్చించారు. గ్రాట్యుటీ, బీమా సొమ్ము చెల్లించేందుకు ఆదేశించారు.పదవీ విరమణ పొందిన కార్మికులు... 60సంవత్సరం.. 2017చెల్లించాల్సిన గ్రాట్యుటీ మొత్తం.. రూ.2.16 కోట్లుఇతరుల్లో మృతులు.. 30

వీరికి రావాల్సినవి.. రూ.2.25 కోట్లు

# మిద్దె తోట.. ఆరోగ్య బాట

ముత్తారం: మిద్దె తోటల పెంపకం క్రమంగా పట్టణాల నుంచి పల్లెలకు విస్తరిస్తోంది. కూరగాయల ధరలు పెరగడంతో భవనాలపై, ఖాళీ స్థలాల్లో వివిధ రకాల మొక్కల పెంపకం మొదలైంది. కరోనా తర్వాత ఆరోగ్య స్పృహ పెరిగింది. ఇలాంటి కోవలోకే వస్తారు ముత్తారం మండలకేంద్రానికి చెందిన గడ్డం శ్రీలత, శ్రీధర్ దంపతులు. నాలుగేళ్ల కిందట కరోనా సమయంలో శ్రీలత, శ్రీధర్ దంపతులకు మిద్దె తోట ఆలోచన వచ్చింది. వెంటనే వేయి చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటి డాబాపై వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు నాటారు. సేంద్రియ ఎరువులు వేస్తుండగా రోజుకు రెండు నుంచి మూడు కిలోల కూరగాయలు, పండ్ల దిగుబడి వస్తోంది.

**అన్ని రకాల మొక్కలు**

సొరకాయ, బెండ, మిర్చి, వంకాయ, బీర, దొండ, టమాట, మునగ వంటి కూరగాయలు.. గోంగూర, తోటకూర, బచ్చల ఆకు, పాలకూర, మెంతి, పుదీన, కొత్తిమీర, కరివేపాకుతో పాటు నిమ్మ, జామ, మామిడి వంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వాము, తులసి వంటి ఔషధ



మొక్కలు.. గులాబీ, మల్లె, మందారం వంటి పూల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. శ్రీలత ఇంట్లో ఉండే ప్లాస్టిక్ బకెట్లు, పాత డబ్బాలను కుండీలుగా మార్చి మొక్కలు పెంచుతున్నారు.

**ఎర్రమట్టి, పశువుల ఎరువు**

మొక్కలకు పూర్తి స్థాయిలో సేంద్రియ ఎరువునే వాడుతున్నారు. 50 నుంచి 100 లీటర్ల వరకు జీవామృతం తయారు చేస్తూ, చీడపీడల నివారణకు వారానికి ఒకసారి మొక్కలపై వేప నూనె పిచికారీ చేస్తున్నారు. రోజువారీగా వచ్చే కూరగాయల వ్యర్థాలతో కంపోస్టు తయారు చేస్తున్నారు. ఎర్రమట్టి, పశువుల ఎరువును మిశ్రమంగా చేసుకొని అవసరమైనప్పుడు ఉపయోగిస్తున్నారు.

**నీరు ఉరవకుండా ఫ్లోరింగ్**

శ్రీలత-శ్రీధర్ మిద్దె తోట సాగుకు సుమారు రూ.50 వేలు ఖర్చు చేశారు. కోతులు రాకుండా చుట్టూ రూ.30 వేలతో సోలార్ కంచె ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట సేంద్రియ పద్ధతిపై అవగాహన పెంచుకున్నారు. భవనం కప్పు నుంచి నుంచి నీరు లోపలకు ఉరవకుండా రసాయనాలతో ఫ్లోరింగ్ చేసి మొక్కల కుండీల కింద స్టాండ్ ఏర్పాటు చేశామని శ్రీలత తెలిపారు.

# మైదానాల్లో ఆడలేదు.. సామగ్రి వాడలేదు

కరీంనగర్ : గ్రామీణ, పల్లెల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి తమకు నచ్చిన ఆటల్లో నైపుణ్యం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. గ్రామం, పురపాలిక వార్డుల్లో ఎకరం స్థలంలో దాదాపు రూ.2 లక్షలు ఖర్చు చేసి వీటిని చదును చేసి సౌకర్యాలతో తీర్చిదిద్దారు. మైదానాల్లో క్రీడాకారులకు కావాల్సిన సామగ్రి కిట్లను కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల కేంద్రాలకు ఆగస్టులో సరఫరా చేయగా, ముందు అందించిన కిట్లు పంపిణీ చేయగా ఆలస్యం జరిగినా అలాగే ఉండిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 312 గ్రామాల్లో, వార్డుల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి, 1549 కిట్లు అందించారు. గ్రామీణ క్రీడా ప్రాంగణాలు.. అందిన కిట్ల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

**అట్ట డబ్బాల్లోనే కిట్లు..**

మైదానాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు లాంగ్‌జంప్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేశారు. కానీ 90 శాతం మైదానాల్లో క్రీడాకారులు ఇప్పటి వరకు ఆడలేదు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు పంపిణీ చేశారు. క్రికెట్ కిట్టులో 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్‌లో నెట్, బంతి, ఫుట్ పంపు, టేప్‌తోపాటు జిమ్‌కు సంబంధించి 30 కిలోల మూడు సెట్ల డంబుల్స్, 1, 2 కిలోల డిస్కస్‌త్రోలు, 6 టెన్నీకాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ తాళ్లు, 3 విజిల్స్, ఒక స్టాప్ వాచ్, కిట్ బ్యాగుతోపాటు క్రీడాకారులకు 75 టీషర్టులు ఆయా జిల్లాలకు అందాయి. కొన్ని కిట్లు పంపిణీ చేశారు. కానీ వాటిని పర్యవేక్షించేవారు లేక సామగ్రి ఎక్కడుందో తెలియని పరిస్థితి. ఆలస్యంగా పంపిణీ జరిగిన క్రీడా సామగ్రి కిట్లు ఆయా జిల్లాల క్రీడాశాఖ కార్యాలయం, కలెక్టరేట్లలో నిరుపయోగంగా ఉన్నాయి.

**ముహూర్తం కోసం..**

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని క్రీడా కిట్ల పంపిణీకి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారు. ఈ కిట్లను భారాస ప్రభుత్వ హయాంలో పంపిణీ చేయగా కిట్లపై మాజీ సీఎం కేసీఆర్ చిత్రం ఉంది. ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్న చిత్రాలను అతికించారు. కిట్ల పంపిణీకి స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల కోసం ఉమ్మడి జిల్లాలోని క్రీడాశాఖ అధికారులు వేచి చూస్తున్నట్లు సమాచారం.

కళ తప్పిన క్రీడా ప్రాంగణాలు..

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం ఆటలు ఆడకపోవడంతో రైతులు వడ్లను ఆరబెట్టేందుకు ఉపయోగిస్తున్నారు.

చొప్పదండిలోని 5వ వార్డు పరిధిలో ఉన్న క్రీడా ప్రాంగణం బోర్డులను తొలగించి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నారు.

గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలోని క్రీడా ప్రాంగణంలో గడ్డి, పిచ్చి మొక్కలతో ఆటలు ఆడేందుకు అనువుగా లేదు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం అజ్మీరాతండలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో క్రీడలు ఆడకపోవడంతో ధాన్యాం కొనుగోలు కేంద్రానికి ఉపయోగిస్తున్నారు.

బోయినపల్లి మండలం రామన్నపేటలో వైకుంఠదామం పక్కనే గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. వర్షం పడితే ప్రాంతం మొత్తం నీరు నిలిచిపోయి క్రింది ప్రాంతం కోతకు గురవుతుంది.

జగిత్యాల జిల్లా గొల్లపల్లి గ్రామ శివారులోని ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణంలో చెట్లు, రాళ్లు, ఎత్తుపల్లాలు ఉంటుంది. ఇక్కడ క్రీడలు ఆడే అవకాశమే లేదు.

ఉమ్మడి జిల్లాకు మంజూరైన కిట్లు..

రాజన్న సిరిసిల్ల: 307

జగిత్యాల : 553

కరీంనగర్: 434

పెద్దపల్లి: 255

## దిల్లీ బాటలో భాగ్యనగరం

హైదరాబాద్ : వాయు కాలుష్యంలో భాగ్యనగరం దిల్లీకి బాటలో పయనిస్తోంది. వాయునాణ్యత నానాటికీ క్షీణిస్తోంది. ఆదివారం నమోదైన సూచీ లెక్కల ప్రకారం నగరంలోని నాలుగు ప్రాంతాల్లో వాయునాణ్యత క్షీణించింది. సనత్‌నగర్‌లో అత్యధికంగా 270 నమోదు కాగా.. ఇక్రిశాట్‌లో 166, ఐడీఏ పాశమైలారంలో 162, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నమోదు కేంద్ర వద్ద 144గా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. రానున్న రోజుల్లో చలితీవ్రత పెరిగే సూచనలు ఉండడంతో కాలుష్యం అంతే స్థాయిలో పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చలి మంటల కోసం చెత్తను తగలబెట్టడం, డంపింగ్ యార్డుల్లో చెత్తను కాల్చకూడదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిర్మాణ రంగంలోనూ కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. వాయునాణ్యత క్షీణిస్తూ.. వాహనాల రద్దీ, బహిరంగ చెత్త దహనం, పారిశ్రామిక కాలుష్యం, అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆర్ఎంసీలతో నగరంలో వాయునాణ్యత నానాటికీ క్షీణిస్తోంది. ఏడాది కాలంలోనే కలుషిత నగరాల జాబితాలో నగరం చేరిందంటే



పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఆధారంగా రూపొందించిన నివేదిక ప్రకారం కలుషిత నగరాల జాబితాలో హైదరాబాద్ ఏడో స్థానంలో ఉంది.

ఎక్కడెక్కడ.. ఎల్బీనగర్, రాజేంద్రనగర్, గగన్ పహాడ్ ప్రాంతాలతో పాటు బాపూఘాట్ నుంచి పీర్జాదీగూడ వరకు మూసీ తీరం వెంబడి చెత్తను దహనం చేస్తున్నట్లు బల్దియా, పీసీబీకి ఫిర్యాదులు అందాయి. నిర్మాణ రంగంలో ఆర్ఎంసీలు.. కాలుష్య ఉద్గారాలకు సంబంధించి ఆర్ఎంసీల(రెడీ మిక్స్ కాంక్రీట్)పై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో పీసీబీ చర్యలు చేపట్టింది. ఇంజినీరింగ్ సంస్థలకు గడువు విధిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఆర్ఎంసీ నిర్వహణలో క్లోజ్డ్ షెడ్‌లు, స్ప్రింక్లర్లు వినియోగించకపోవడంతో దుమ్ము రేగి అతి సూక్ష్మధూళి కణాలు వెలువడుతున్నాయి.

## వైకుంఠధామాల్లో మానీరు
## ఆఖరి మజిలీకి అవస్థలు

వేములవాడ : మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్ వైకుంఠధామాల్లోకి చేరింది. దీంతో అంత్యక్రియల నిర్వహణకు వివిధ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల అనాలోచిత చర్యల వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరని దుస్థితి నెలకొంది. రాజరాజేశ్వర జలాశయ నిర్మాణంలో వేములవాడ మండలం సంకెపల్లి, కొడిముంజ గ్రామాలు ముంపునకు గురికాగా, ఆరెపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు, కొన్ని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. పాత గ్రామాల్లో మూలవాగు, ప్రభుత్వ స్థలాల్లో అంత్యక్రియలు నిర్వహించేవారు. ఆఖరి మజిలీలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా వైకుంఠధామాల నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా ఆరెపల్లి, సంకెపల్లిలో మూలవాగు సమీపంలో నిర్మాణం చేపట్టారు. వైకుంఠధామాలతోపాటు కంపోస్టు షెడ్లు కూడా అక్కడే కట్టారు.

**స్థలాల ఎంపికలో నిర్లక్ష్యం**

సంకెపల్లి, ఆరెపల్లిలో వైకుంఠధామాల నిర్మాణం కోసం స్థలాల ఎంపిక సరిగ్గా చేయలేదు. జలాశయంలో పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేసిన సమయంలో బ్యాక్‌వాటర్ వైకుంఠధామాల్లోకి వచ్చి చేరుతుంది. నీరు ఉండటం వల్ల అంత్యక్రియలను ఆరెపల్లిలో ఇటీవల వైకుంఠధామానికి వెళ్లే దారిలోనే చేయాల్సి వచ్చింది. సంకెపల్లి ముంపు గ్రామంలో ఓ స్థలాన్ని చదును చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు ఉపయోగపడే విధంగా చూడాల్సిన అధికారులు బ్యాక్‌వాటర్ వల్ల కలిగే ఇబ్బందులను గుర్తించకుండా నిర్మించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కొడుముంజలో...**

కొడుముంజ ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం నిర్మించిన వైకుంఠధామానికి రహదారి సమస్య ఉంది. నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఈ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదు. అంత్యక్రియల సమయంలో ట్రాక్టర్లలో దూరప్రాంతం మీదుగా వెళ్లాల్సి వస్తుందని వాపోయారు

**రహదారిపైనే అంత్యక్రియలు**

మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్ వైకుంఠధామంలోకి వచ్చి చేరింది. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జలాశయంలో నీరు లేని సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. నీరు నిల్వ చేసినప్పుడు వైకుంఠధామంలోకి నీరు రావడంతో ఆ మార్గంలోని రహదారిపైనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తుంది. మంజిడి వీరేశం, ఆరెపల్లి

**మరో చోట కట్టాలి**

సంకెపల్లిలో నిర్మించిన వైకుంఠధామంలోకి నీరు చేరడంతో ముంపు గ్రామంలోని ఓ స్థలాన్ని చదును చేసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ముంపు గ్రామంలో నీరు రాని ప్రాంతాన్ని గుర్తించి కడితే ఆఖరిమజిలీలో ఇబ్బందులు తొలగుతాయి. స్థలాన్ని ఎంపిక చేసే సమయంలో భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవకుండా అధికారులు చూడాలి. జింక శ్రీనివాస్, సంకెపల్లి

**ఇబ్బందులను పరిష్కరించాలి**

మృతి చెందిన దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు వైకుంఠధామం దారి సమస్య మరింత బాధ కలిగిస్తుంది. అంత్యక్రియలు నిర్వహించడానికి ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలి. రాగుల నాగరాజుగౌడ్, కొడుముంజ

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

నీట మునిగిన వైకుంఠధామాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. అంత్యక్రియలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తాం.
రాజీవ్ మల్హోత్రా, ఎంపీడీవో

## మంజూరు అక్కడ.. బోధన ఇక్కడ!




తాండూరు : బడి మధ్యలో మానేయకుండా.. వసతితో కూడిన బోధన అందించేందుకు ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. గురుకులాలు అందుబాటులోకి వచ్చి సంవత్సరాలు గడిచినా సొంత భవనాలు నిర్మించలేదు. వెరసి అసౌకర్యాలతో కూడిన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులకు ప్రతిరోజు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**పాత డైట్ కళాశాల భవనంలో..**

తాండూరు మండలం చెంగెష్‌పూర్ మార్గంలోని పాత డైట్ కళాశాల భవనంలో అద్దె ప్రతిపాదికన మహాత్మా జ్యోతి బా ఫులే బీసీ బాలికల గురుకులాన్ని అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. 5 నుంచి ఇంటర్ వరకు 630 మంది విద్యార్థులున్నారు. ఇక్కడి గురుకుల పాఠశాల అద్దె భవనం నాపరాయి పరిశ్రమల పక్కన ఉండటంతో రాత్రిపగలూ శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ఈ ప్రభావం విద్యార్థులు, ఉపాధ్యాయులపై పడుతోంది. తరచూ అనారోగ్యం పాలవుతున్నారు.

**వికారాబాద్ గురుకులం తాండూరులో..**

వికారాబాద్ మండల బీసీ గురుకుల పాఠశాలను తాండూరు నియోజకవర్గం మంబాపూర్‌లో నిర్వహిస్తున్నారు. సొంత భవనంలేకపోవడంతో పక్క నియోజకవర్గంలో గురుకులాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడి అద్దె భవనంలో 430 మంది విద్యార్థులు చేరారు. సరిపడా గదులు, సరైన సదుపాయాల్లేకపోవడంతో ఇక్కడి ఇంటర్ కళాశాలను నవాబుపేటలో నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**తాండూరు- హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఏర్పాటు**

తాండూరు–హైదరాబాద్ రహదారి మార్గంలోని పాత శాలివాహన కళాశాల భవనంలో బీసీ బాలుర వసతి గృహాన్ని 2017 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు బోధన చేస్తున్నారు. 432 మంది విద్యార్థులు చేరారు. ఏడు సంవత్సరాలు గడిచినా సొంత భవన నిర్మాణంపై ఊసెత్తడం లేదు. కళాశాల భవనాన్ని అద్దెకు తీసుకొని గురుకులాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు నెలకు రూ.2.44లక్షల అద్దె చెల్లిస్తున్నారు. అద్దె భవనంలో గదుల కొరతతో ఇంటర్ కళాశాలను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని కనకమామిడిలో 120 మంది విద్యార్థులతో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వసతులు కూడా సక్రమంగా లేవు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం

సమస్యలను బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు దృష్టికి తీసుకెళ్లాం. అద్దె భవనంలో కిటికీలు దెబ్బతిన్నాయి. చీకటిపడ్డాక చలి, దోమలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనం సమకూర్చితే సౌకర్యంగా ఉంటుంది. నరేష్, ప్రిన్సిపల్, బీసీ గురుకుల పాఠశాల.

## రంగులు మాయం.. దుప్పట్లూ దూరం



హైదరాబాద్ : ఈ ఫొటో చూశారా.. గాంధీ ఆసుపత్రి మూడో అంతస్తులోని జనరల్ మెడిసిన్ వార్డు. మలేరియా, డెంగీ, చికున్‌గన్యా జ్వరాలతోపాటు ఇతర రోగులతో ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ఇందులో 20కి పైగా మంచాలు ఉండగా.. ఒక్కదానిపై కూడా బెడ్‌షీట్ లేకపోవడం రోగుల దుస్థితికి అద్దం పడుతోంది. కొన్ని రోజులుగా మంచంపై దుప్పటి పరిచే నాథుడే కన్పించడం లేదు. కొందరు సొంతంగా దుప్పట్లు తెచ్చుకుంటున్నారు. లేని వాళ్లు బయట దుకాణాల్లో కొనుక్కొంటున్నారు. కొనుక్కోలేని వారు చలికి వణుకుతూ దోమలతో సహవాసం చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు దుప్పట్లు సరఫరా చేస్తే...వాటితో నెట్టికొస్తున్నారు.

**గొప్పగా చెప్పి.. వేయడమే మరిచి**

సర్కారు దవాఖానాల్లో గతంలో రోజుకో రంగు బెడ్‌షీట్ ప్రవేశపెడుతున్నట్లు అప్పట్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఘనంగా చెప్పుకొచ్చారు. కేంద్ర ఆరోగ్యశాఖ మార్గదర్శకాల ప్రకారం నిబంధనల్లో మార్పులు చేర్పులు చేస్తున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా తొలి విడతగా తెలుపు, గులాబీ, ఊదా రంగుల బెడ్‌షీట్‌లను ప్రవేశపెట్టారు. గతంలో తెలుపు రంగు బెడ్‌షీట్లు మాత్రమే ఉండేవి. బదులుగా రోజూ ఒక రంగు వాడటం వల్ల తరచూ పడకలపై దుప్పట్లు మార్చడంతోపాటు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడే వీలు ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే రంగుల బెడ్‌షీట్ల విధానం తెరపైకి తెచ్చారు. ఏడాది వరకు గాంధీ, ఉస్మానియా ఇతర ఆసుపత్రుల్లో ఈ రంగుల బెడ్‌షీట్లు దర్శనమిచ్చాయి. తర్వాత మెల్లగా ఇవి కనుమరుగై మళ్లీ తెలుపు రంగువే దర్శనమిచ్చాయి. ప్రస్తుతం వాటికి కూడా దిక్కులేదని రోగులు వాపోతున్నారు. గాంధీ ఆసుపత్రిలోని పలు వార్డుల్లో అసలు పడకలపై దుప్పట్లే వేయడం లేదని చెబుతున్నారు. పరుపులు సైతం చిరిగి పోవడంతో ఇబ్బందిగా ఉంటోంది. ఉస్మానియాలో దుప్పట్లు ఉన్నా...2–3 రోజులకొకసారి మార్చుతున్నారు. దుప్పటి మార్చాలంటే సిబ్బంది చేయి తడపాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు.


**చలి..ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తి...**చలి తీవ్రత పెరిగింది. గాంధీ ఆసుపత్రిలో 1500, ఉస్మానియాలో 1169 వరకు పడకలు అందుబాటులో ఉన్నాయి. అంతకుమించి రోగులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో పడకలపై దుప్పట్ల కొరత వేధిస్తోది. ఉతుక్కునే అవకాశం లేకపోవడంతో రోజుల తరబడి అవే వినియోగించడం వల్ల ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తి పెరిగి ఇతరులకు సోకే ప్రమాదం ఉందని అంటున్నారు. వాస్తవానికి నిత్యం పడకలపై దుప్పటి, తలగడ కవర్లు మార్చాలి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

## పల్లెలకు వెళ్లడం లేదు..!

జగిత్యాల : జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31 వరకు సర్పంచుల పాలన కొనసాగగా ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత వారు గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించటం మానేశారు. ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా ప్రత్యేక కార్యక్రమం ఉంటే తప్పా గ్రామాలకు వెళ్లటంలేదు. పంచాయతీ కార్యదర్శులతో చిన్న చిన్న పనులు కొనసాగిస్తున్నారు. జగిత్యాల గ్రామీణ మండలం వెల్దుర్తిలో మురుగు కాలువల నుంచి తీసిన వ్యర్థాలు, చెత్తను రోడ్డుపైనే వదిలేశారు. జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ కారణంగా చెత్తను తీస్తుండగా మరికొన్ని గ్రామాల్లో నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. తాగునీటి క్లోరినేషన్ కూడా చేయటంలేదని ఆరోపణలున్నాయి.

**డీపీవో, డీఎల్‌పీవో పోస్టులు ఖాళీ..**

పల్లెల్లో పాలన కుంటుపడటానికి జిల్లా అధికారులు లేకపోవటం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా అదనపు కలెక్టర్‌గా ఉన్న రఘువరణ్ నిర్వహిస్తున్నారు. డీఎల్‌పీవో కనకదుర్గ బదిలీపై వెళ్లగా కోరుట్ల, మెట్‌పల్లి డీఎల్‌పీవోలు ఉద్యోగ విరమణ పొందారు.



ఎంపీడీవోలు, ఎంపీవోలు పల్లెల్లో పర్యటిస్తున్నా ఏం చేయలేని పరిస్థితి నెలకొంది.

**నిధులు లేవు.. పనులు కావు**

ప్రత్యేకాధికారుల పాలనలో 16వ ఆర్థిక సంఘ నిధులు నిధులు తప్పా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్ రావటంలేదు. ఆర్థిక సంఘ నిధులు వేతనాలు, ఇతర బిల్లులకు కూడా సరిపోవటంలేదు. పల్లెల్లో పన్నుల వసూలు అంతంత మాత్రమే కావటంతో మోటార్ల రిపేరు, వీధి దీపాల ఏర్పాటు, ట్రాక్టర్ల డీజిల్, ఇతర ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొందరు పంచాయతీ కార్యదర్శులు చిన్న చిన్న పనులు చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి అధ్వానంగా మారుతున్నాయి. వీధి దీపాలు లేక చీకట్లోనే ఉండాల్సి వస్తోంది. గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వెళ్లకపోవడంతో పాలన అంతా అస్తవ్యస్తంగా మారింది.

## అక్రమాలపై ఉక్కుపాదం

మంథని : మంథని మండలంలో అక్రమాలపై కొద్దికాలంగా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి తరలింపుపై నిఘా తీవ్రతరం చేశారు. గడిచిన మూడు నెలల్లో అక్రమార్కులపై నమోదవుతున్న కేసుల్లో వేగం పెరిగింది. **ఇసుక రవాణాపై నిఘా**

గోపాల్‌పూర్ సమీపంలోని మానేరు నుంచి, విలోచవరం గ్రామ శివారు గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అరికట్టడానికి ఎస్సై పక్కా ప్రణాళికతో సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేశారు. గతంలో పగలే ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసేవారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 7 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోగా గత మూడు నెలల్లో 8 ట్రాక్టర్లను పట్టుకొని ఒక్కోదానికి రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. అక్టోబరులో 15 మందిని బైండోవర్ చేశారు.

**109 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం**

మంథని ప్రాంతంలో రేషన్ వినియోగదారుల నుంచి సేకరిస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు పెద్ద మొత్తంలో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గ్రామాల్లో, డీలర్ల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి సుందిళ్ల బ్యారేజ్ మీదుగా రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బియ్యాన్ని నిల్వ చేసే ప్రాంతాలపై, రవాణాపై పోలీసులు నిఘా పెంచారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 7 కేసులు నమోదు కాగా సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు 6 కేసులు నమోదు చేసి 5 వాహనాలను సీజ్



చేశారు. 109 కింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసి 8 మందిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు.

**గంజాయి గుట్టు రట్టు**

మంథని ప్రాంతంలో గంజాయి గుప్పుమంటోంది. యువకులు మత్తులో మునిగి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. కొందరి జీవితాలు రోడ్డున పడ్డాయి. మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి కాళేశ్వరం మీదుగా మంథనికి వస్తున్న గంజాయిపై ఎస్సై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు ఒక కేసు నమోదైతే, గడిచిన మూడు నెలల్లో 2 కేసులయ్యాయి. రెండు రోజుల కిందట పట్టణంలోని శ్రీపాదకాలనీలో గంజాయిని స్వాధీనం చేసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. జూదం శిబిరాలపై పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నారు. గత రెండు నెలల కాలంలో 3 స్థావరాలపై దాడులు చేసి రూ.33,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. గత మూడు నెలల్లో 100 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.

**నిర్భయంగా ఠాణాకు రావొచ్చు**

ప్రజలకు నష్టం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఇసుక, బియ్యం అక్రమ రవాణా చేసేవారిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గంజాయి రవాణాదారులపై సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అక్రమాలపై ప్రజలు నిర్భయంగా ఠాణాకు రావాలి. డి.రమేశ్, మంథని ఎస్సై

## పోషకాహారంతో ఆరోగ్య భాగ్యం

పెద్దపల్లి : ఉదయం ఏడైనా సూరీడు కనిపించడు.. చలిలో బయటకు వెళ్లడానికే భయం.. తరచూ పలకరించే జ్వరం, జలుబు.. పొడి బారే చర్మం.. వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందడానికి అనుకూలమైన వాతావరణం.. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాల్సిన సయమం.. శీతాకాలంలో వ్యాయామం, ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్య సంరక్షణ సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు. **ఏ వయసు వారు ఏం తినాలి?**

పదేళ్లలోపు: చలికాలంలో పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. పదేళ్లలోపు పిల్లలకు తరచూ డ్రైఫ్రూట్స్ లడ్డూలు, భోజనంతో పాటు రెండు పూటలా పాలు, ఉడకపెట్టిన గుడ్లు ఇవ్వాలి.

10–15 ఏళ్లు: ఇనుము, కాల్షియం ఉండే కూరగాయలు, ఆకుకూరలతో ఎముకలు పటిష్టంగా ఉంటాయి. నువ్వుల ముద్దలు తినిపిస్తే శరీరానికి వేడితో పాటు కాల్షియం, ఖనిజ లవణాలు లభిస్తాయి. 15–30 ఏళ్లు: ఈ వయసులో పోషకాలతో కూడిన ఆహారం అవసరం. తాజా కూరగాయలు, కోడిగుడ్డు, నీరు ఎక్కువ తీసుకోవాలి. బ్రౌన్ రైస్‌తో వండిన భోజనం మంచి పోషకాలను అందిస్తుంది.

30–60 ఏళ్లు: త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. సకల పోషకాలున్న జొన్న రొట్టె రక్తకణాల వృద్ధికి దోహదపడుతుంది. వృద్ధులు రాత్రి భోజనంలో నూనె తగ్గించాలి.

**వాటితో రక్షణ**

అన్ని వయసుల వారు తాజా పండ్లు తీసుకోవాలి. జామ, కమలాలు, బత్తాయి బాగా పని చేస్తాయి. బొప్పాయి, చిటికెడు పసుపుతో పాటు పాలు, అరటి పండ్లు పొట్ట శుభ్రం కావడానికి ఉపకరిస్తాయి. బార్లీ, రాగి జావ, కొంచెం జీలకర్రను అల్లంతో మరిగించి తాగించాలి. రక్తపోటు, మధుమేహం, అస్తమా ఉన్న వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మందపాటి దుస్తులు, స్వెటర్లు, మాస్కులు ధరించాలి. చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్సులు రక్షణ కల్పిస్తాయి.

**పిల్లలు భద్రం**

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పదిహేనేళ్ల వయసు పిల్లల వరకు ఎక్కువగా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. చిన్నారుల్లో ముక్కు దిబ్బడ ఉంటే తరచూ ఆవిరి పట్టాలి. గొంతు నొప్పి ఉంటే గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి పుకిలించాలి. ఉతికిన దుప్పట్లు, పరుపులు మాత్రమే వినియోగించాలి. ఇన్‌ఫ్లూయెంజా వ్యాక్సిన్ పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా కాపాడుతుంది. పడక గదిలోకి చల్లటి గాలులు రాకుండా చూసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్న సమయంలో బయట ఎక్కువసేపు గడపరాదు.

**న్యుమోనియా ప్రమాదం**ఇటీవలి కాలంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా న్యుమోనియా హడలెత్తిస్తోంది. గాలిలోని వైరస్, బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. జ్వరం, జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. వ్యాధి నిరోధక శక్తి క్షీణించి ఆయాసం పెరుగుతుంది. మద్యపానం, ధూమపానం అలవాటున్న వారు అప్రమత్తంగా ఉండాలి. **నడక.. ఆగొద్దు**చలి తీవ్రత ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాయామం ఆపొద్దు. వృద్ధులు సూర్య కిరణాలు వచ్చిన తర్వాతే నడక ప్రారంభించాలి. ఉదయం వీలు కాకుంటే సాయంత్రం నడవాలి. వ్యాయామ సమయంలో శరీరానికి వెచ్చగా ఉండే స్కార్ఫ్, స్వెట్టరు, టోపీ ధరించాలి. గుండె సంబంధిత, మధుమేహ వ్యాధిగ్రస్థులు వ్యాయామం, నడక మధ్యలో విరామం ఇవ్వాలి. చెమట పట్టేంత వరకు అతిగా వ్యాయామం చేయొద్దు. **చర్మం పొడిబారనివ్వొద్దు**శరీరం పొడిబారి దురద, దద్దుర్లు వస్తుంటాయి. నిర్లక్ష్యం చేస్తే దురద ఎక్కువై శరీరమంతటికీ వ్యాప్తి చెందుతుంది.

# అమ్మ ఆరోగ్యం.. బిడ్డకు శ్రేయస్కరం

కరీంనగర్ : గర్భిణుల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 'అమ్మ కోసం' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వారిలో వచ్చే థైరాయిడ్, మధుమేహం, రక్తహీనతతోపాటు రక్తపోటు, క్యాన్సర్ తదితర సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడే వారు ఎంతమంది ఉన్నారు? ఆ ఇబ్బందిని ఎలా అధిగమించాలి? వారు ఏయే ఆహారం తీసుకోవాలి? అసలు సమస్య రాకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు.

**నేర్చుకున్న అంశాలపై సామర్థ్య పరీక్ష**

అమ్మకోసం యాప్ ద్వారా రోజూ ఏఎన్ఎంలకు చరవాణిలో దృశ్య, శ్రావణం ద్వారా గర్భిణులకు అందించే వైద్యసేవలపై వివరిస్తారు. ప్రధానంగా గర్భిణుల్లో రక్తహీనతను సకాలంలో గుర్తించి ముందే నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎదురయ్యే ఎక్కువ ప్రమాద స్థాయి (హైరిస్క్)ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఏఎన్ఎంలు విని, నేర్చుకున్న అంశాలపై వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఆన్‌లైన్‌లో వారికి పరీక్షతోపాటు క్విజ్ పోటీలు నిర్వహించారు.

**ప్రతి నెల గర్భిణి ఆరోగ్య స్థితి పరిశీలన..**

ప్రతి నెల గర్భిణి ఆరోగ్య పరిస్థితి, పిండం ఎదుగుదలను పరిశీలిస్తారు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి వైద్య సేవలు అందిస్తారు. ప్రమాదకర స్థాయి పరిస్థితిలో ఎలాంటి వైద్యం అందించాలి. ఎక్కడకు తీసుకెళ్లాలని అంశాలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తారు. నెలనెలా నిర్వహించే వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి.. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే నివారణకు వైద్యులను సంప్రదిస్తారు. గర్భిణులు మధుమేహం బాధితులుంటే.. పుట్టే బిడ్డకు సోకకుండా వైద్యుల సూచనతో మందులు అందించాలి. ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అవగాహన కల్పిస్తారు.

**పుస్తక రూపంలో అందించాం**

గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎక్కువ ప్రమాదకరస్థాయి విధానాన్ని గుర్తించడం, నివారణ చర్యలపై రోజువారి కార్యక్రమాలు యాప్ ద్వారా తెలుసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి వైద్యసేవలు, సూచనలు అందిస్తున్నాం. గతంలో పుస్తక రూపంలో అందించి ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులకు ఉపయోగకరంగా ఉంటుంది.
తిరుమల, లక్ష్మీదేవిపల్లి ఏఎన్ఎం

**ఎప్పటికప్పుడు పరీక్షలు**

గర్భిణులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు 'అమ్మ కోసం' యాప్ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం. తెలుసుకున్న అంశాలపై రాత పరీక్షతోపాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. గర్భిణులు మొదట్నుంచి బలవర్ధక ఆహారం తీసుకోవడంతోపాటు సానుకూలంగా ఉండేలా చుట్టూ పరిస్థితులను అనుకూలంగా ఏర్పాటు చేసుకోవాలి. తాము ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై వాకబు చేస్తాం.
శ్రీలత, గంగాధర ఏఎన్ఎం

**ప్రసవం తర్వాత ప్రత్యేక దృష్టి**

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తర్వాత ఏడాది వరకు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటివరకు అత్యవసరంగా భావించిన 689 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యం అందించాం. 1097 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించాం. గర్భం దాల్చిన నుంచి ప్రసవం జరిగే వరకు తమ శాఖ తరఫున అవసరమైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# బంగారు రుణం.. ప్రగతికి ప్రయోజనం

తాండూరు : వ్యాపార కేంద్రంగా పేరొందిన తాండూరులో బంగారం తాకట్టు రుణాలు ఏటా పెరుగుతున్నాయి. రూ.కోట్లల్లో రుణ మంజూరులో ఏకంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే గత ఆర్థిక సంవత్సరంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి సంబంధించి కథనం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వేదికగా..ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 49 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. తాండూరు మండలంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 33 పంచాయతీల్లోని 2200మందికిపైగా రైతులు సభ్యులుగా నమోదయ్యారు. ఈ సంఘం ద్వారా ఏటా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట రుణాల్ని పంపిణీ చేస్తున్నారు.

**2012లో శ్రీకారం**

ఈ సహకార సంఘం ద్వారా బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేయడం 2012 సంవత్సరంలో ప్రారంభించారు. రూ.10లక్షలతో ప్రారంభమైన రుణాల పంపిణీ పన్నెండు సంవత్సరాల్లో ఏకంగా



రూ.21.32కోట్లకు చేరింది. ఇప్పటివరకు 17వేల మందికిపైగా పొందారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీలో సంఘానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటిస్థానం దక్కింది. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల మాజీ అధ్యక్షులు బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారుల్ని అభినందించారు.

**తీరుతున్న అవసరాలు**

రుణాలు పొందుతున్న వారిలో వ్యాపారులే ఎక్కువ. పిల్లల ఉన్నత చదువులకు, వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల కొనుగోలుకు స్వీకరణ. చిన్నతరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు వినియోగం. ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు మరింత విస్తరించేందుకు, కొత్తగా మరిన్నిచోట్ల వ్యాపారాలను ప్రారంభించేందుకు స్వీకరణ.

**అడిగిన వెంటనే ఇస్తున్నాం**

వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు, డీఏపీ యూరియా అందజేస్తున్నాం. దీంతోపాటు బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేస్తున్నాం. ముఖ్యంగా రైతులకు సాగుకు సకాలంలో ఉపయోగపడే విధంగా అండగా నిలిచేందుకు యత్నిస్తున్నాం. పోటీని తట్టుకొని ఎక్కువ మందికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర అవసరాల వారు సైతం కేంద్రంలో సంప్రదించవచ్చు. – శ్రీనివాస్, సీఈఓ, ఎల్మకన్నె సహకార సంఘం, తాండూరు.

# అరకొర వసతులు.. అన్నదాత అవస్థలు



కోనరావుపేట : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల ప్రారంభానికి ముందు ధాన్యం రాశులుగా పోయడానికి వీలుగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి చదును చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో కేంద్రాల్లో నెలకొన్న సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.70 లక్షల పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. 3 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ 8, మెప్మా 4 మొత్తం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తేమశాతం 17 ఉండాలి. క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకానికి మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా బోనస్ ప్రభుత్వం ప్రకటించింది.

**ఇవి కల్పించాలి...**

రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ నిబంధనల మేరకు శుభ్రం చేయడానికి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించి చదును చేయించాలి. అకాల వర్షం, తేమశాతం బారిన పడకుండా కాపాడుకోవటానికి సరిప డా టార్పాలిన్లను ప్రభుత్వం సమకూర్చాలి. ధాన్యం శుద్ధి చేయటానికి ప్యాడీ క్లీనర్, తేమశాతం సరిచూసే పరికరాలు అందుబాటులో ఉంచాలి. శుద్ధజలంతోపాటు సేదదీరడానికి పూరి గుడిసెలు ఏర్పాటు చేయాలి. విద్యుత్తు దీపాలు లేక అంధకారం నెలకొంది. రాత్రి వేళ వాచ్‌మెన్ అందుబాటులో లేక ధాన్యం దొంగతనానికి గురయ్యే ప్రమాదం ఉంది.

**పది రోజులు అయింది**

నేను వానాకాలంలో 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజుల క్రితం 3 ఎకరాల్లోని ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో పోశాను. సేకరణ ప్రారంభిస్తే తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేయడానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో మధ్యదళారులు, మిల్లర్లకు రూ.1900 నుంచి రూ.2000 విక్రయిస్తున్నారు. మెరుగైన వసతులు కల్పించి తూకాల్లో జాప్యం లేకుండా చూడాలి.
ఎర్ర దేవయ్య, రైతు, ధర్మారం

**రెండు మండలాల్లో ప్రారంభం**

జిల్లాలో ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి బుధవారం ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని పీఏసీఎస్ సీఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. రైతులు నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలి. కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ డీసీవో

# రైల్వే ఆధునికీకరణ నత్తనడక



వికారాబాద్ : ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' కింద శ్రీకారం చుట్టింది. తెలంగాణలో 15 రైల్వే స్టేషన్లు ఎంపిక చేయగా దీన్లో వికారాబాద్, తాండూరు కూడా ఉన్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ ఎక్కువ. దీని పునర్ నిర్మాణానికి రూ.24.35 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి మూడు నెలలు కొనసాగిన తరువాత ఆగిపోయాయి. అసంపూర్తి పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

**ముఖచిత్రమే మారిపోతుందన్నారు**

రైల్వే స్టేషన్ ముఖ చిత్రం మార్చే విధంగా ఆధునిక హంగులతో స్టేషన్ భవనం, ఫ్లోరింగ్ నిర్మాణానికి ముఖ ద్వారాన్ని, విశ్రాంతి గదిని కూల్చివేశారు. మొదట కవర్ ఆఫ్ ప్లాట్ ఫాం కింద షెడ్ల విస్తరణ చేపట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా నీడనిచ్చే విధంగా షెడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టి వదిలేశారు. స్టేషన్ పేరు తెలిపే బోర్డులను సైతం తొలగించి ప్లాట్‌ఫాంపై పెట్టారు. పిల్లర్లకు గుంతలు తవ్వారు. కొత్తగా లిఫ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత వీటి పురోగతిని పట్టించుకోవడం మానేశారు

**నిత్యం 15,000 మంది రాకపోకలు**

ఈ స్టేషన్ మీదుగా ముంబయి, బెంగళూర్, బీదర్, పుణె, షిర్డీ, తిరుపతి, గుంటూరు, పల్నాడు తదితర ప్రాంతాలకు నిత్యం 25 రైళ్లు నడుస్తాయి. రూ.4 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. వికారాబాద్ ప్రాంత వాసులే కాకండా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంత వాసులు ఇక్కడి నుంచి ప్రయాణాన్ని సాగిస్తారు. హైదరాబాద్‌లో ఉంటూ వికారాబాద్‌లో విధులు నిర్వహించే వారు కూడా రైలులో వచ్చివెళుతుంటారు. ఇలా నిత్యం 15 వేల మంది రైలులో ప్రయాణిస్తుంటారు.

**పనుల్లో వేగం పెంచుతాం**

వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో కొనసాగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచుతాం ఇటీవల నేను స్వయంగా స్టేషన్‌లో కొనసాగుతున్న విశ్రాంతి గదుల అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించా. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా. తగు చర్యలు తీసుకుంటాం. బర్తేష్‌కుమార్ జైన్, డీఆర్ఎం, సికింద్రాబాద్. నిజాం నవాబుల కాలంలో..స్వాతంత్ర్యానికి ముందు సికింద్రాబాద్ నుంచి వాడి వరకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేశారు. నిజాం తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలను అనుసంధానిస్తూ రైల్వే లైన్‌ను వేశారు. మధ్యలో వికారాబాద్ ఉండటంతో ఇక్కడ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రద్దీ స్టేషన్ కావటంతో 2010లో ఆదర్శ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేశారు. ఆ తర్వాత గత ఫిబ్రవరిలో మరోసారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

# రాయితీ ఇచ్చేద్దాం.. తుక్కుగా మార్చేద్దాం..

హైదరాబాద్: 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలనే కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా గ్రేటర్ చుట్టూ మూడు ప్రాంతాల్లో తుక్కు కేంద్రాల ఏర్పాటుకు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. శంషాబాద్ నందిగామ, వర్గల్, తూప్రాన్‌లో వీటి ఏర్పాటుకు ప్రాథమికంగా పరిశీలన చేసింది. ఇప్పటికే ఓ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీతో పాటు మరో రెండు కంపెనీలు రిజిస్టర్ వెహికల్ తుక్కు కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

గ్రేటర్ వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వాహనాలు 18 లక్షలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలను ఫిట్‌నెస్ చేసిన తర్వాత హరిత పన్ను చెల్లించి, మరో అయిదేళ్లు నడుపుకోవచ్చు.

తుక్కు పాలసీ కింద.. ఈ వాహనాలను తుక్కుగా మార్చాలి. ఇది నిర్బంధం కాకపోవడంతో ఎంతమంది స్వచ్ఛందంగా ముందుకొస్తారనేది అనుమానమే.

**స్వచ్ఛందంగా ముందుకొచ్చి..**

తుక్కు కింద మార్చితే.. కొత్త వాహనాలు కొనుగోలు సందర్భంగా రాయితీలు ఇవ్వనున్నారు. తుక్కుకు ఖరీదు కట్టి, అందులో కొంతమేర యజమానులకు చెల్లిస్తారు.

**వింటేజ్ వాహనాలపై రాని స్పష్టత..**

తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలు ఏం చేస్తారనేది దానిపై ఎక్కువ మంది ఆరా తీస్తున్నారు. నగరంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ ఏళ్లు దాటిన కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. పూర్వీకుల



నుంచి వచ్చిన ఆస్తిగా చాలామంది వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా 50 వేల వరకు ఇలాంటి వాహనాలు ఉన్నట్లు అంచనా. తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలపై ప్రత్యేక నిర్ణయం తీసుకుంటారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు. గ్రీన్ ట్యాక్స్ చెల్లించి కొందరు ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. మరికొందరు అసలు బయటకే తీయడం లేదు. త్వరలో వింటేజ్ వాహనాలకు సంబంధించి విధివిధానాలపై స్పష్టత వస్తుందని ఓ అధికారి తెలిపారు.

# భూబ్యాంకులో భద్రం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మహా భూ బ్యాంకు సిద్ధం చేసింది. ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతోపాటు పలు సంస్థలకు కేటాయింపులు, లేఅవుట్లకు పోను ఇంకా 5,364 ఎకరాల వరకు ఉంది. ఇటీవల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతుండటంతో అసలు లెక్కలు బయటకు తీసింది. ఏడు జిల్లాల పరిధిలో ఎంత భూమి ఉందో సరిచూసింది. దీంతో రూ.వేల కోట్ల విలువైన భూములు హెచ్ఎండీఏ ఖాతాలో ఉన్నట్లు తేలింది. ఈ బ్యాంకులోని భూములను కాపాడుకునేందుకు హెచ్ఎండీ కసరత్తు చేయడంతోపాటు భవిష్యత్తులో వీటిని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భూములు అధిక ధర పలుకుతుండటంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

**భవిష్యత్తు అవసరాలకు...**

మహానగరం విస్తరిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ దాటి అవుటర్ రింగ్ రోడ్డు వరకు నిర్మాణాలు వెలుస్తున్నాయి. రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత మహానగర పరిధి దాదాపు 8 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం పెరగనుంది. అప్పటి అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులకు భూమి చాలా కీలకం. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడక తప్పదు. దీంతో హెచ్ఎండీఏ భూ బ్యాంకు కాపాడుకుంటే భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. అయితే భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడం హెచ్ఎండీఏకు పెద్ద సవాలుగా మారుతోంది. తొలుత చిన్న చిన్న గుడిసెలు వేసి...వాటికి




దొంగ సర్వే నెంబర్లు సృష్టిస్తున్నారు. నెమ్మదిగా పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిని కూల్చడానికి వెళితే కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారు. ఈ భూముల రక్షణ కోసం హెచ్ఎండీఏ పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జీపీఎస్‌తో అనుసంధానం..**

శేరిలింగంపల్లిలోని మియాపూర్‌లోని సర్వే నంబరు 100, 101లో హెచ్ఎండీఏకు 445.340 ఎకరాలు ఉండగా.. ఇటీవల ఇందులో పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు నేతలు ప్రోద్బలంతో గుడిసెలు వేయగా...అధికారులు అతికష్టం మీద అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ హెచ్ఎండీఏ కంచె నిర్మిస్తోంది. జీపీఎస్‌తోనూ అనుసంధానం చేయనున్నారు. భవిష్యత్తులో ఎవరైనా సర్వే రాళ్లు తొలగించి హెచ్ఎండీఏ భూమిలోకి చొచ్చుకొచ్చినా జీపీఎస్ కోఆర్డినేట్స్ చూసి తొలగించే అవకాశం ఉంది.

కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని వివిధ సర్వే నంబర్లలో 2370 ఎకరాలు ఉండగా...ఇందులో ఇప్పటికే వివిధ అవసరాల కోసం 795 ఎకరాలు కేటాయించారు. ఇంకా 1574.300 ఎకరాలు హెచ్ఎండీఏ ఖాతాలో ఉంది. ఈ భూమికి సరైన రక్షణ లేక ఆక్రమణల పాలవుతోంది. దాదాపు ఆరేడు వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయి. చాలాచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

# బిల్డర్ల నుంచే బాధితులకు పరిహారం..?

బాచుపల్లిలో చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లోనే ఓ బడా నిర్మాణ సంస్థ రెండు టవర్లను కట్టింది. సుమారు వెయ్యి మంది ఒక్కో ఫ్లాట్‌ను రూ.80లక్షల నుంచి రూ.కోటిన్నరకు కొనుగోలు చేశారు. ఈ ఫ్లాట్లను హైడ్రా కూల్చేస్తే అందులో ఉంటున్న వారంతా రోడ్డున పడే అవకాశం ఉంది. మూసాపేటలోనూ ఓ చెరువు ఎఫ్‌టీఎల్‌ను మార్చేసి ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసింది. నగరంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. ఇందులో కొన్నింటికి తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం వీటిని హైడ్రా కూల్చివేయాల్సిందే. ఒకవేళ ఇదే చేస్తే ఎన్నో ఏళ్ల కిందట వాటిని కొనుగోలు చేసిన సామాన్యులు రోడ్డునపడతారు. ఇలాంటి నిర్మాణాల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే భావనలో హైడ్రా అధికారులున్నారు. వీరికి బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల కిందట హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని మంత్రి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై త్వరలో సర్కార్ విధానపరమైన నిర్ణయం తీసుకోనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**రెండు నెలలు బ్రేక్...**

సుమారు 2 వేలకుపైగా కట్టడాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయి. వీటిలో చాలా వాటికి బల్దియా, హెచ్ఎండీఏ, పంచాయతీలు



అనుమతులు ఇచ్చాయి. ఈ విషయంలో అధికారులు నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు తెలుస్తోంది. కొందరు బిల్డర్లు ఒక సర్వే నంబరులో అనుమతులు తీసుకొని మరో సర్వే నంబరులో ఇళ్లను నిర్మించారు. వీటిని వేలాది మంది కొనుగోలు చేశారు. వీటన్నింటినీ కూల్చితే కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోతారని, ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై సీనియర్ మంత్రులతో చర్చించి ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని సీఎం నిర్ణయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. బిల్డర్ నుంచి కొనుగోలుదారులకు పరిహారం ఇప్పించాలని యోచిస్తున్నారు. మూసీ విషయంలోనూ దీన్నే అవలంబిస్తారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలలపాటు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని హైడ్రా నిర్ణయించింది.




అమరావతి: ఏపీలో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. ఈ భారీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులంతా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న వేళ కీలక అప్‌డేట్ వచ్చింది. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమవుతున్న విద్యాశాఖ అధికారులు.. ఈ లోగా అభ్యర్థులు పరీక్షల కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు వీలుగా సబ్జెక్టుల వారీగా డీఎస్సీ సిలబస్‌ను విడుదల చేశారు. ఏపీ డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఈ సిలబస్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.




విశాఖపట్నం: అక్రమంగా తరలిస్తున్న అత్యంత ప్రమాదకరమైన బల్లులను విశాఖ విమానాశ్రయంలో కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. నీలిరంగు నాలుక కలిగిన బల్లులు 3, వెస్టర్న్ బల్లులు మూడింటిని స్వాధీనం చేసుకున్నారు. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అక్రమంగా వీటిని తీసుకొచ్చినట్టు అధికారులు గుర్తించారు. డీఆర్ఐ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన సోదాల్లో వీటిని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బల్లులను డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.




## బంగ్లాదేశ్‌లో చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్.. స్పందించిన పవన్ కల్యాణ్

అమరావతి: బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకులు చిన్మయ్ కృష్ణదాస్‌అరెస్ట్‌ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. దీనిపై కలసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ మేరకు పవన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. హిందువులను లక్ష్యంగా చేసుకున్న తీరు తమను తీవ్రంగా కలచివేస్తోందని పేర్కొన్నారు. హిందువులపై అఘాయిత్యాలను ఆపాలని బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్‌కు విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం భారత సైన్యం రక్తం చిందించిందని.. దేశ వనరులు ఖర్చువడంతో పాటు మన ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోయారని పవన్ పేర్కొన్నారు.

**అదానీ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం**... మరోవైపు దిల్లీ పర్యటనలో ఉన్న పవన్ మీడియాతో మాట్లాడారు. జగన్‌కు అదానీ ముడుపుల అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వంలో చాలా అవకతవకలు జరిగాయని.. అన్ని అంశాలను పూర్తిగా పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని చెప్పారు. పక్క రాష్ట్రాల్లో పట్టుబడిన ఎర్రచందనంపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పవన్ అన్నారు. పట్టుబడిన ఎర్రచందనం విక్రయంలో వాటాపైనా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నోడల్ ఏజెన్సీపై గత ప్రభుత్వం ముందుకు వెళ్లలేదన్నారు.

**ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతికి సింగిల్ విడో విధానం మేలు...** దిల్లీ పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిశారు. ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగిల్ విండో విధానానికి మార్చాలని ఆయన్ను కోరారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే 'ఈ వేలం'లో మెరుగైన ఫలితాలు వస్తాయని తెలియజేశారు.

ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్ కట్టడి, దుంగల అమ్మకం విషయంలో అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల ప్రతిపాదించిన ప్రకారం ఎర్రచందనం అమ్మకం, ఎగుమతి చేసే విషయంలో సింగిల్ విండో విధానం ఉంటే మేలు జరుగుతుందని పవన్ చెప్పారు. ఈ విధానానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కస్టోడియన్‌గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.




అమరావతి: దేశ వ్యాప్తంగా ప్రకంపనలు రేపుతున్న జగన్, అదానీ వ్యవహారంలో సరికొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిబంధనలు ఉల్లంఘించి మరీ అదానీకి అనుమతులు ఇచ్చిన విషయం సంచలనం రేపుతోంది.

ఆఘ మేఘాలపై కుదిరిన అనుబంధం.. ఒప్పందాల గుట్టు రట్టయింది. మంత్రి వర్గం ఆమోదం లేకుండానే రెండు అనుబంధ విద్యుత్ విక్రయ ఒప్పందాలు జరిగిన విషయం బయటకు వచ్చింది. ఈ వ్యవహారం మొత్తంలో ఏపీపీసీసీ ఛైర్మన్ హోదాలో విజయానంద్ తీవ్ర ఉల్లంఘలకు పాల్పడినట్లు సమాచారం. మంత్రి వర్గం ఆమోదం మేరకు ఏదైనా ఒప్పందం కురుర్చుకుంటే అందులో మార్పు చేర్పులకు మళ్లీ మంత్రి వర్గం ఆమోదం పొందాలి. కానీ అందుకు విరుద్ధంగా అధికారుల కమిటీయే ఆ ఒప్పందంలో మార్పు చేర్పులకు సమ్మతిస్తే వాటి ఆధారంగా అనుబంధ ఒప్పందాలు కూడా జరిగిపోతే అది ఖచ్చితంగా నిబంధనల ఉల్లంఘనే. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఇలాంటి తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడ్డారు. సెకీ నుంచి 7వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలు కోసం డిస్కంలతో కలిపి ఏపీ ప్రభుత్వం 2021 డిసెంబర్ 1న ప్రధాన ఒప్పందం కుదుర్చుకుంది. అదే సమయంలో 4,667 మెగా వాట్ల అదానీ రెన్యువబుల్ ఎనర్జీ నుంచి 2,333 మెగావాట్ల అజూర్ పవర్ ఇండియా నుంచి కొనుగోలు చేసి ఏపీ ప్రభుత్వానికి సరఫరా చేసేలా సెకీ.. ఆ సంస్థలతో మరో ఒప్పందం చేసుకుంది. సెకీకి 2,333 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా ప్రాజెక్టులో తాము కొనసాగలేమంటూ సీటీయుఐఎల్ 2023 జులై 6 నిర్వహించిన సమీక్ష సమావేశంలో అజూర్ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెలియజేసింది. సెకీతో తాము కుదుర్చుకున్న ఒప్పందం నుంచి వైదొలిగేందుకు అనుమతించాలని విన్నవిస్తూ సెకీకి వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా వేసింది.

## పరవాడ ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా.. విచారణకు ఆదేశం



పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని మరో పరిశ్రమ నుంచి విషవాయువు లీకై కార్మికుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఠాగూర్ ల్యాబొరేటరీస్ కంపెనీలో మంగళవారం విషవాయువు లీకై 9 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు.

వారిని గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒడిశాకు చెందిన కార్మికుడు అమిత్(22) మృతి చెందాడని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని కార్మిక సంఘాలు తెలిపాయి.

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం చంద్రబాబు...** మరో వైపు ఠాగూర్ ల్యాబొరేటరీస్ ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా వారికి సాయం చేయాలన్న ముఖ్యమంత్రి... బాధితులకు అందుతున్న సాయంపై జిల్లా యంత్రాంగం, సంబంధిత మంత్రులు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రమాద స్థలంలో సీసీ టీవీ ఫుటేజ్ సేకరిస్తున్నాం: కలెక్టర్...** ఠాగూర్ ల్యాబ్స్ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తెలిపారు. రియాక్టర్ కమ్ రిసీవర్ ట్యాంక్ నుంచి లిక్విడ్ హెచ్‌సీఎల్ లీకైందని వెల్లడించారు. తొమ్మిది మంది కార్మికులకు శ్వాస, దగ్గు సమస్యలు వచ్చాయని తెలిపారు.

అస్వస్థతకు గురైన వారిని గాజువాకలోని పవన్‌సాయి ఆసుపత్రికి, ముగ్గురిని విశాఖ షీలానగర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. చికిత్స పొందుతూ అమిత్ అనే కార్మికుడు మృతి చెందాడని, మరో ఇద్దరు కార్మికులకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను ఆదేశించామని కలెక్టర్ వివరించారు. ప్రమాద స్థలంలో సీసీ టీవీ ఫుటేజ్ సేకరిస్తున్నామన్నారు.

## నన్ను హింసించిన వారంతా జైలుకు వెళ్లడం ఖాయం: రఘురామ



అమరావతి: సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ అరెస్టును ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు స్వాగతించారు. కస్టడీలో తనను హింసించిన వారంతా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలన్నారు. రఘురామకృష్ణ రాజును కస్టడీలో వేధించిన కేసులో విజయ్‌పాల్‌ను మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఆయన బెయిల్ పిటిషన్‌ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేసింది.


మంగళవారం రాత్రి నుంచి విజయ్‌పాల్ ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఉన్నారు. ఆయన్ను నేడు గుంటూరు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. నగరపాలెం పోలీసు స్టేషన్‌కు ఆయన్ను తీసుకురానున్నారు. గుంటూరు కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఈ ఏడాదిలో విమానాలకు 994 బాంబు బెదిరింపులు: కేంద్రమంత్రి

దిల్లీ: ఇటీవల పలు భారత విమానయాన సంస్థలకు వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఈ విషయంపై చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విమానయాన శాఖ సహాయ మంత్రి మురలీధర్ మోహోల్ మాట్లాడుతూ 2024లో ఇప్పటివరకు భారత విమానయాన సంస్థలకు 994 బూటకపు బాంబు బెదిరింపులు వచ్చినట్లు వెల్లడించారు. 2022 నుంచి 2024 నవంబర్ 13 వరకు మొత్తం 1,143 బెదిరింపులు నయోదయ్యాయని వెల్లడించారు. ఇటువంటి బెదిరింపులు క్రమంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే బెదిరింపులకు పాల్పడుతున్న వారి లొకేషన్ గురించి సరైన సమాచారం తెలియకపోవడంతో దర్యాప్తు ఆలస్యమవుతోందని అన్నారు.

ఇటువంటి చర్యలను కట్టడి చేయడానికి పౌర విమానయాన భద్రత మండలి(%దీజూూ%), ఏవియేషన్ సెక్యూరిటీ రెగ్యులేటర్ కృషి చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా విమానాశ్రయాలకు వచ్చే బెదిరింపులపై దర్యాప్తు చేయడం కోసం బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల భారత్‌కు చెందిన విస్తారా, ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, స్టార్‌ఎయిర్, అలయన్స్ ఎయిర్ సహా వివిధ భారతీయ విమానయాన సంస్థలకు వరుసగా బూటకపు బాంబు బెదిరింపులు రావడంతో ప్రయాణికులు, ఎయిర్‌లైన్స్ సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దీంతో పలు సామాజిక మాధ్యమ వేదికలకు కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. బూటకపు బెదిరింపులకు పాల్పడిన పలువురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.


## అజ్ఞాతంలోనే రాంగోపాల్‌వర్మ.. ఆరు పోలీసు బృందాలతో గాలింపు



అమరావతి: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ రెండు రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన కోసం ఆరు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళలో ఆర్జీవీ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఆయనపై తెలుగు రాష్ట్రాల్లో 9 కేసులు నమోదయ్యాయి. విచారణకు రాకుండా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరగనుంది. మరోవైపు తాను ఎక్కడికీ పారిపోలేదని మంగళవారం రాంగోపాల్ వర్మ వీడియో విడుదల చేశారు.

ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వర్మ ఎక్స్‌లో పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్‌లో కేసు నమోదైంది. మద్దిపాడు మండల తెదేపా కార్యదర్శి ఎం.రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు నోటీసులు అందజేశారు. వాటికి స్పందించకపోవడంతో ఆయన్ను అరెస్టు చేసేందుకు ఇటీవల హైదరాబాద్‌లోని నివాసానికి వచ్చారు. అప్పటి నుంచి ఆర్జీవీ అజ్ఞాతంలో ఉన్నారు.

## ఫ్లైయాష్ కోసం కూటమి నేతల మధ్య పోటాపోటీ.. ఆర్టీపీపీ వద్ద మోహరించిన పోలీసులు



ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం ఆర్టీపీపీ (రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు) వద్ద పోలీసులు మోహరించారు. ఫ్లైయాష్ కోసం జమ్మలమడుగు, తాడిపత్రి కూటమి నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. తాడిపత్రి నుంచి వచ్చే లారీలను ఆర్టీపీపీ వద్ద అడ్డుకుంటున్నారన్న సమాచారంతో పోలీసులు మోహరించారు. ఈక్రమంలో ఇటీవల వైఎస్ఆర్ జిల్లా ఎస్పీకి జేసీ ప్రభాకర్‌రెడ్డి రాసిన లేఖతో ఉత్కంఠ నెలకొంది. ఆర్టీపీపీ ఉచిత బూడిద కోసం రెండు నియోజకవర్గాల నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. కొండాపురం, ముద్దనూరు, తాళ్ల పొద్దుటూరు ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు.

**అసలేం జరిగిందంటే..** గత వైకాపా ప్రభుత్వ హయాంలో బూడిదను అప్పటి జమ్మలమడుగు, తాడిపత్రి ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పెద్దారెడ్డిలు సిమెంటు పరిశ్రమలకు సరఫరా చేసేవారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రి పురపాలక సంఘం ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు బూడిద తోలుకోవడం ప్రారంభించారు. ఇటీవల ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డు చెప్పడంతో వివాదం ముదిరి పాకాన పడింది.

ఆదినారాయణరెడ్డి వర్గీయులు సరఫరా చేసే బూడిదను తాడిపత్రి పరిసరాల్లోని సిమెంటు పరిశ్రమలకు సరఫరా కాకుండా ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో సరఫరా స్తంభించడంతో తాడిపత్రి నుంచి ప్రభాకర్‌రెడ్డి తన వర్గీయులతో ఆర్టీపీపీ వద్దకు మంగళవారం వస్తారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. భారీగా ఆర్టీపీపీ, తాడిపత్రి మార్గంలో పోలీసు బలగాలను మోహరించారు. ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి వర్గీయులు తలపడే అవకాశం ఉండడంతో ఉదయం నుంచి రాత్రి వరకు నిఘా పెట్టారు. రెండు వర్గాలు రాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం తమ వాహనాలకు బూడిదను నింపకపోతే తాను ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతానంటూ వైఎస్ఆర్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడికి ప్రభాకర్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉత్కంఠ నెలకొంది.

## వైసీపీ అధినేత జగన్ అవినీతి బయటపడింది: ఆనం వెంకటరమణారెడ్డి..

అమరావతి: అవినీతి చేయడంలో తనను మించిన వారు లేరని ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మరోసారి నిరూపించారని ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ విద్యుత్ కొనుగోళ్లలో జగన్ రెడ్డికి 200 మిలియన్ డాలర్ల లంచం ముట్టిందని ఆనం ఆరోపించారు. అవినీతిలో వైసీపీ అధినేతకు మించిన మరో వ్యక్తి లేడని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ తేల్చిందని ఆయన చెప్పారు. జ్యూరీ ట్రైల్ బై డిమాండ్ ప్రకారం సంవత్సరంలో జగన్ రెడ్డి భాగోతం మొత్తం ఎఫ్‌బీఐ బట్టబయలు చేయనుందని అన్నారు. ఈ కేసు నుంచి ఎవ్వరూ తప్పించుకునే అవకాశమే లేదని ఆనం చెప్పారు. జూన్, 2020లో 90 రోజుల్లో డిస్కంలతో పీపీఏ ఒప్పందం చేసుకోవాలని సెకీతో అగ్రిమెంట్ చేసుకుంటే.. 18 నెలలు అయినా జగన్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చేసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కమిషన్‌లు ఇస్తామనడంతో అర్ధరాత్రులు సైతం ఫైళ్లు పరిగెత్తుకుంటూ అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటికి చేరాయని ఆనం చెప్పారు. దీంతో ఏదో లొసుగుందని అర్థం చేసుకున్న బాలినేని జాగ్రత్తపడి సైడ్ అయిపోయారని ఆయన వెల్లడించారు. అనంతపూర్ సోలార్ పార్క్ చేసిన పీపీఏల్లో అన్ని రాష్ట్రాల కంటే ఏపీనే తక్కువ రేటుకు విద్యుత్ కొనుగోలు చేసిందని ఆయన చెప్పారు. ఇందులో ఎక్కడ తప్పు జరిగిందో ఎంపీ విజయ్ సాయిరెడ్డి చెప్పాలని ఆనం డిమాండ్ చేశారు. 6.4 గిగావాట్ల సోలార్ పవర్ కోసం ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ టెండర్ పిలవగా అదానీ, షిర్డిసాయి, టొరెంట్ నాలుగు కంపెనీలు మాత్రమే వచ్చాయని అన్నారు. టెండర్ వేస్తామని టాటా కంపెనీ వస్తే లంచం ముట్టలేదని జగన్ రెడ్డి ససేమిరా అన్నారని ఆనం వెంకట రమణారెడ్డి ధ్వజమెత్తారు.

# మార్వల్ క్వీన్‌లా రాశీ ఖన్నా స్టైల్!

అవును.. చూస్తుండగానే ఎంత మార్పు? తెలుగు సినీపరిశ్రమలో దశాబ్దం కెరీర్ ని విజయవంతంగా రన్ చేసిన రాశీ ఖన్నా తమిళం, హిందీలోను నటిస్తోంది. ఇటీవల రాజ్ అండ్ డీకే వెబ్ సిరీస్ 'ఫర్జీ'లో నటించాక ఇమేజ్ మరింత పెరిగింది. చూస్తుండగానే రాశీ హాలీవుడ్‌కి జంప్ అయ్యేట్టే ఉంది. రోమ్ వెళితే రోమన్ లా ఉండాలని భావించిందో ఏమో కానీ, ఇప్పుడు గెటప్ మొత్తం మార్చేసింది ఈ దిల్లీ బ్యూటీ. చూస్తుండగానే సూపర్ ఉమెన్ గా మారింది. ఈ లుక్కు చూడగానే యాక్షన్ క్వీన్ ని తలపిస్తోంది. రాశీ స్టన్నర్ లుక్ ప్రస్తుతం ఇంటర్నెట్ లో డిబేటబుల్ గా మారింది. ప్రొఫెషనల్ ఫోజ్ ఎరా.. ఆల్వేస్ ఆన్ డ్యూటీ! అంటూ ఈ ఫోటోషూట్ ని షేర్ చేసింది రాశీ. ఈ బ్యూటీ డిజైనర్ దుస్తుల ఎంపిక రియల్లీ




ఇంప్రెస్సివ్! అంటూ పొగిడేస్తోంది యూత్. ఇంతకుముందు వంగపువ్వు రంగు ఫ్రాకులో గుబులు రేపిన రాశీ ఇటీవల ఫోటోషూట్ల పరంగా అంతకంతకు వేడి పెంచేస్తోంది. ప్రియాంక చోప్రా, సమంత బాటలోనే ఈ అమ్మడు కూడా కొత్తగా ప్లాన్ చేస్తోందని అర్థమవుతోంది. మార్వల్ క్వీన్ లా ఉంది.. రాశీ ఒకవేళ హాలీవుడ్ కి జంప్ అవుతుందేమో! అంటూ అభిమానులు జోష్ ఫుల్ గా కామెంట్ చేస్తున్నారు. ఇటీవలే విడుదలైన ది సబర్మతి రిపోర్ట్ వెబ్ సిరీస్ కి విమర్శల ప్రశంసలు దక్కాయి. ఇందులో రాశీఖన్నా నటనకు మంచి పేరొచ్చింది. తదుపరి సినిమాల గురించి ప్రకటిస్తుందేమో వేచి చూడాలి.

**మద్రాస్ కేఫ్ నుండి...** మద్రాస్ కేఫ్ నుండి ది సబర్మతి రిపోర్ట్ వరకు రాశీ ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించింది.

ఇది చాలా సుసంపన్నమైన ప్రయాణం.. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించినందుకు గౌరవంగా.."ఎక్స్‌ట్రార్డినేర్ సెన్సేషనల్ పెర్ఫార్మర్" అవార్డుకు ఎంపికైంది. నెక్సా బ్రాండ్స్ ఐఎన్‌సి ఈ పురస్కారం అందించింది.

# జిమ్‌లో కర్వులు చూపిస్తూ యంగ్ హీరోయిన్ ఫికర్

శర్మా సిస్టర్స్ లో ఐషా శర్మ ఎంతో చురుకైన ఫిట్ నెస్ ఫ్రీక్. నటి కం మోడల్‌గా ఫిలింసర్కిల్స్ లో పాపులరైంది. ఐషా మొదట ఆయుష్మాన్ ఖురానా ఐక్ వారి మ్యూజిక్..వీడియోలో నటించింది. ఆ తర్వాత హిందీ యాక్షన్ థ్రిల్లర్ సత్యమేవ జయతేలో జాన్ అబ్రహం, మనోజ్ బాజ్‌పాయ్ లాంటి ప్రతిభావంతులైన స్టార్లతో అవకాశం అందుకుంది. కానీ ఈ బ్యూటీ కెరీర్ ఆశించిన రేంజుకు చేరుకోలేదు. తన సోదరి నేహా శర్మతో కలిసి షైనింగ్ విత్ ది శర్మాస్ అనే వెబ్ షోతోను అలరించింది. ఇక ఇన్ స్టాలో నిరంతరం వేడెక్కించే హాట్ ఫోటోషూట్లను షేర్ చేసే ఐషా శర్మ.. బికినీలో బాడీ హగ్గింగ్ దుస్తుల్లో అందాలను ఆరబోయడంలో వెనకాడదు. ఈ భామ బోల్డ్ ఫోటోషూట్లకు బోలెడంత గిరాకీ ఉంది. లక్షల్లో ఫాలోవర్స్ ఇన్ స్టాలో తనను అనుసరిస్తుండగా, ఈ వేదికపై కొన్ని వాణిజ్య ప్రకటనలను ఐషా షేర్ చేస్తోంది. తన సోదరితో కలిసి ప్రకటనల్లో నటించడం ద్వారా బాగానే ఆర్జిస్తోంది. అదంతా అటుంచితే తాజాగా ఐషా శర్మ షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. సానుకూల జీవితాన్ని ఆస్వాధించడానికి ఐషా శర్మ %-%ఇన్‌స్టంట్ మూడ్ లిఫ్టర్స్ గురించి కొన్నిటిని సూచించింది. ఈ వారాంతంలో



తన ఆరోగ్యం, మానసిక చికిత్సకు ప్రాధాన్యతనిస్తూ జిమ్‌లో ఎక్కువ సమయం గడిపింది. తన ఇన్‌స్టంట్ మూడ్ లిఫ్టర్స్ ఏమిటో వివరిస్తూ ఇన్‌స్టాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది ఐషా. అంతేకాదు.. ఈ యంగ్ బ్యూటీ స్వీయానుభవం నుంచి ఇతరులు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. వర్కౌట్ లకు సహకరించేలా ఫ్లెక్సిబుల్ స్పోర్ట్స్ బ్రాలెట్.. బాడీ హగింగ్ డ్యూరబుల్ వస్త్రాలను ధరించిన ఐషా ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. కేవలం వర్కౌట్ ల కోసం తయారు చేసిన దుస్తులివి... వర్కౌట్ చేయకూడదనుకునేవారిలోను ఉత్సాహాన్ని పెంచే దుస్తులివి... ఐషా వర్కవుట్లతో పాటు తన ఆలోచనలను కాగితంపై ఉంచి, కృతజ్ఞతా జర్నలింగ్ అని తెలిపింది. కాఫీ సేవిస్తే అది మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని ఐషా తెలిపింది. అలాగే సంగీతం వినాలి. జాన్ మేయర్ రాసిన లవ్ ఈజ్ ఎ వెర్బ్ ట్యూన్‌లకు ప్రాక్టీస్ చేస్తే.. అది మీ సెరెనేడింగ్‌ను ఏ సమయంలోనైనా మంచి వైబ్‌లకు అందజేస్తుంది.




# విశ్వంభర సైలెంట్.. మెగా ప్లాన్ ఏంటో..?



భోళా శంకర్ తర్వాత ఇక రొటీన్ టెంప్లేట్ కి బ్రేక్ ఇచ్చి ఒక భారీ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాడు మెగాస్టార్ చిరంజీవి. అందుకే బింబిసారతో సత్తా చాటిన డైరెక్టర్ వశిష్టతో సినిమా లాక్ చేసుకున్నాడు. విశ్వంభర అంటూ ఒక భారీ బడ్జెట్ సినిమాను చేస్తున్నారు. ఈ సినిమాను యువి క్రియేషన్స్ నిర్మిస్తున్నారు. మెగా విశ్వంభర సినిమా అసలైతే జనవరిలో సంక్రాంతి బరిలో రిలీజ్ చేయాలని అనుకున్నారు. రిలీజ్ టార్గెట్ తో సినిమాను స్పీడ్ స్పీడ్ గా చేస్తూ వచ్చారు. కానీ సినిమా జనవరి నుంచి వాయిదా పడటంతో టీం అంతా రిలాక్స్ అయ్యారు. అదీగాక విశ్వంభర సినిమా కన్నా ముందు గేం ఛేంజర్ సినిమా వస్తుంది. దాని మీద మెగా ఫ్యాన్స్ ఎక్కువ ఫోకస్ ఉంటుందని గుర్తించిన విశ్వంభర టీం గేమ్ ఛేంజర్ రిలీజ్ తర్వాత సినిమా ప్రమోషన్స్ ప్లాన్ చేయాలని అనుకుంటున్నారు. సంక్రాంతికి చరణ్ గేమ్ ఛేంజర్ భారీ అంచనాల మధ్య వస్తుంది. ఈ సినిమాను శంకర్ డైరెక్ట్ చేశారు. తన మార్క్ సోషల్ మెసేజ్ తో పాటు రియల్ కమర్షియల్ సినిమా చూపించాలని ఫిక్స్ అయ్యారు శంకర్. అందుకే గేమ్ ఛేంజర్ విజువల్స్ చాలా డిఫరెంట్ గా ఉన్నాయి. ఇక విశ్వంభర సినిమా కూడా షూటింగ్ దాదాపు చివరి దశకు రాగా సినిమాకు సంబంధించిన కొన్ని మేజర్ సీన్స్ షూట్ చేయాల్సి ఉందని తెలుస్తుంది. చిరు విశ్వంభర సినిమా విషయంలో మేకర్స్ ఎక్కడ కాంప్రమైజ్ కావట్లేదని తెలుస్తుంది. సినిమాలో చిరుకి జోడీగా త్రిష నటిస్తుంది. ఆమెతో పాటు మీనాక్షి చౌదరి, ఆషిక రంగనాథ్ కూడా ఉన్నారు. విశ్వంభరతో చిరంజీవి మరోసారి తన మాస్ స్టామినా చూపించాలని అనుకుంటున్నారు. మెగా విశ్వంభర సినిమాకు కీరవాణి మ్యూజిక్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. చిరంజీవి విశ్వంభర సినిమా రిలీజ్ ఎప్పుడన్నది క్లారిటీలేదు. ఒకవేళ సమ్మర్ కి రిలీజ్ ప్లాన్ చేస్తారేమో చూడాలి. ఫిబ్రవరి, మార్చి నెలలో రిలీజ్ లు దాదాపు కన్ఫర్మ్ అయ్యాయి. ఏప్రిలో ఎలాగు ప్రభాస్ రాజా సాబ్, తేజ మిరాయ్, మంచు విష్ణు కన్నప్ప ఉన్నాయి. సో విశ్వంభర సినిమా వస్తే మేలో వచ్చే ఛాన్స్ ఉంటుంది. తొలి సినిమా బింబిసారతోనే వారెవా అనిపించిన వశిష్ట ఈసారి విశ్వంభరతో ఆడియన్స్ కి ఒక మంచి విజువల్ ట్రీట్ అందించాలని చూస్తున్నాడు. మరి సినిమా ఆశించిన స్థాయిలో ఉంటుందా లేదా మెగా ఫ్యాన్స్ కి మెగా మాస్ ట్రీట్ అందిస్తుందా లేదా అన్నది చూడాలి.

# 75 ఏళ్ల సినీ ప్రస్థానం.. ఎన్టీఆర్ తొలి పారితోషికం ఎంతంటే?




విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, అన్నగారు ఎన్టీఆర్ నటించిన మొదటి సినిమా ఏది? పాత తరం వెంటనే చెప్పగలుగుతుంది కానీ నేటి జెన్ –జెడ్ జనరేషన్ కి గుర్తు చేయాల్సిన పరిస్థితి ఉంది. తెలుగు సినిమా 100 ఏళ్ల చరిత్రలో తొలితరం పేజీలను అలంకరించిన, వీకీ చరిత్రలో అసాధారణ స్టార్‌గా ఏలిన మేటి నటుడు ఎన్టీఆర్ టాలీవుడ్ లో ప్రారంభరోజులను ఓసారి స్మరిస్తే... మన దేశం ఎన్టీఆర్ నటించిన మొదటి చిత్రం. 1949లో విడుదలైన ఈ సాంఘిక చిత్రం విడుదలై నేటికి 75 సంవత్సరాలు పూర్తయింది. ఈ చిత్రంలో ఎన్.టి. రామారావు బ్రిటీష్ పోలీస్‌గా ఓ చిన్న పాత్రలో కనిపిస్తారు. దీనికి ఎల్.వి.ప్రసాద్ దర్శకుడు. ప్రసిద్ధ నటి కృష్ణవేణి ఈ చిత్రానికి నిర్మాత. ఈ సినిమా విప్రదాస్ అనే బెంగాలీ నవల ఆధారంగా తెరకెక్కింది. భారత స్వాతంత్ర్య సంగ్రామం ఈ చిత్ర కథకు నేపథ్యం. ఈ చిత్రంతో పరిచయమైన ఎన్.టి. రామారావు తరువాత తెలుగు చలనచిత్ర రంగంలో ఎంతో ప్రసిద్ధులయ్యారు. అలాగే ఈ చిత్రం ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత దర్శకత్వం వహించిన మొదటి సినిమా. గాయని పి. లీల కూడా ఈ సినిమా ద్వారా తెలుగు సినిమా రంగంలో నేపథ్యగానంలో ప్రవేశించారు. ఇందులో రామారావు పోలీసు వేషం వేశాడు. సినిమా కథనంలో బుర్ర కథ, ఒగ్గు కథ, వీధి నాటకాలు, బొమ్మలాటలు వంటి సాంస్కృతిక కళారూపాలను కథనానికి జోడించారు. ఇంకా దేశ భక్తి గీతాలు, దంపుడు పాటలు, భజనలు, ఇతర జానపద గీతాలను ఉపయోగించారు. సినిమాలో గాంధీ గారి ఉన్నతాదర్శాలను, స్వాతంత్రం సిద్ధించిన తరువాత దిగజారిన విలువలను చూపించారు. ఇది బెంగాలీ కథ ఆధారంగా వెలువడిన మొదటి తెలుగు సినిమా. తరువత దేవదాసు, ఆరాధన వంటి అనేక బెంగాలీ నవలలు తెలుగు సినిమా కథలుగా మారి విజయవంతమయ్యాయి. స్వాతంత్ర్యం రాకముందు ప్రారంభించినప్పటికి కొన్ని కారణాలవల్ల స్వాతంత్ర్యానంతరం పూర్తిచేసి విడుదల చేయగలిగారు. ఈ చిత్రంలో పోలీసు ఇన్స్పెక్టరు పాత్ర పోషించిన ఎన్.టి.ఆర్.కు రూ.2000 పారితోషికం ఇచ్చారు.

**నిజంగానే లాఠీ ఛార్జ్ తో రెచ్చిపోయిన ఎన్టీఆర్:** ఎల్వీ ప్రసాద్ వద్ద ఫోటో చూసిన నిర్మాత బిఏ సుబ్బారావు ఎన్టీఆర్ ని స్క్రీన్ టెస్ట్ కి రావాల్సిందిగా పిలవగానే విజయవాడ నుంచి ఆయన మద్రాసు రైలెక్కారు. అలా తొలిసారి సినిమా కోసం ఫోటోషూట్ లో పాల్గొన్నారు ఎన్టీఆర్. టెస్ట్ పూర్తయ్యాక మరో ఆలోచన లేకుండా తను తీస్తున్న పల్లెటూరి పిల్ల చిత్రంలో హీరోగా అవకాశం కల్పించారు. కానీ ఆ సినిమా రకరకాల కారణాలతో మధ్యలో ఆగిపోయింది. అప్పటికే ఎల్వీ ప్రసాద్ మనదేశం కాస్టింగ్ ఎంపికలు పూర్తి చేసి దర్శకత్వ బాధ్యతలను చేపట్టారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటులంతా ఓకే అయ్యాక చివరిగా కానిస్టేబుల్ పాత్రకు ఎన్టీఆర్ అయితే సరిపోతాడని ఎంపిక చేసుకున్నారు. హీరోని అరెస్ట్ చేసి ఉద్యమకారులను అణచివేసే సీన్ లో ఎన్టీఆర్ రంగ ప్రవేశం.. అతడు పూనకం వచ్చినట్టు ఉద్యమకారులపై లాఠీ ఛార్జ్ చేసారు. దీంతో ఎన్టీఆర్ దూకుడుకు బెదిరిన ఎల్వీ ప్రసాద్ ఇది రంగస్థలం కాదని, అక్కడిలా కాకుండా ఇక్కడ కేవలం కొడుతున్నట్టు నటించాలని సూచించారు. మొత్తానికి ఎన్టీఆర్ చరిష్మా చూసాక ఇతడు పెద్ద స్టార్ అవుతాడని ఆరోజుల్లోనే ఎల్వీ ప్రసాద్ అంచనా వేసారు. కృష్ణవేణి-మీర్జాపూర్ రాజా నిర్మించిన ఈ చిత్రంతో ఎన్టీఆర్ అనే నటుడు భారతీయ సినిమా తెరకు పరిచయం అయ్యారు.

# నేను బికినీ ధరించడం అందరికీ సమస్యలా అనిపించింది: నయనతార

సూర్య హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గజిని'. ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ తమిళ చిత్రంలో ఆసిన్, నయనతార హీరోయిన్లుగా నటించారు. 2005లో వచ్చిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్టయ్యింది. ఇది తెలుగులోనూ మంచి విజయం సాధించింది. అయితే ఈ సినిమా తనకు లోయెస్ట్ పాయింట్ అని లేడీ సూపర్ స్టార్ నయనతార తెలిపింది. అలానే 'బిల్లా' సినిమాలో బికినీ ధరించడం అప్పట్లో అందరికీ పెద్ద సమస్యలా అనిపించిందని చెబుతోంది. నయన్ జీవితం ఆధారంగా రూపొందించిన "నయనతార బియాండ్ ది ఫెయిరీ టేల్" డాక్యుమెంటరీ ఫిల్మ్ నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ గ్లింప్స్ ను ఓటీటే సంస్థ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో షేర్ చేసింది. ఇందులో నయనతార 'గజినీ' సినిమాలో తాను ధరించిన దుస్తులు వల్ల బాడీ షేమ్‌కు గురయ్యానని చెప్పింది. అయితే అందులో తన తప్పేమీ లేదని, దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ఏం చెప్పాడో



అదే తాను చేశానని తెలిపింది. "లోయెస్ట్ పాయింట్ 'గజిని' సినిమా. 'ఆమె చాలా లావుగా ఉంది. ఆమె ఎందుకు నటిస్తోంది? అసలు సినిమాలో ఆమె ఎందుకు వుంది?' అని ఆ రోజుల్లో నా మీద కామెంట్లు రావడం నేను చూశాను. మీరు నా పెర్ఫార్మెన్స్ గురించి మాట్లాడవచ్చు. కానీ ఎవరూ అలాంటి విషయాలు చెప్పకూడదు. బహుశా నేను బాగా లేకపోవచ్చు. కానీ నేను నా దర్శకుడు ఏమి చేయమని చెప్పాడో అదే చేశాను. అతను నేను ఏమి ధరించాలని కోరుకున్నాడో సరిగ్గా అదే ధరించాను. నేను ఇండస్ట్రీకి కొత్తగా వచ్చిన అమ్మాయిని. నేను దాని గురించి ఎప్పుడూ చెప్పలేదు" అని నయనతార తెలిపింది. అజిత్ కుమార్ హీరోగా నటించిన 'బిల్లా' సినిమాలో బికినీ వేయడం గురించి కూడా నయన్ మాట్లాడింది. "నేను చేసిన బికినీ సీన్ పైనే మొత్తం డ్రామా నడిచింది. అది ప్రతి ఒక్కరికీ సమస్యలా అనిపించింది. కానీ నేను అనుకున్నాను.. ప్రతీది అలానే కదా మారుతుంది. నిజమే కదా?. నేను ఏదో ప్రూవ్ చేయాలనే ఉద్దేశ్యంతో అలా చేయలేదు, నాకు నా దర్శకుడు చెప్పడంతో ఆ సీన్ చేశాను. సినిమాకి అవసరం కాబట్టి చేసాను. అది నాకు బాగా పని చేసిందని నేను భావిస్తున్నాను" అని నయనతార చెప్పుకొచ్చింది. ఇదిలా ఉంటే, పెళ్ళి ఇద్దరు పిల్లల తల్లైనా నయనతార హవా ఏమాత్రం తగ్గడం లేదు. ఓవైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే, మరోవైపు కంటెంట్ ఓరియంటెడ్ ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాలతో అలరిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో అర డజనుకు పైగా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. రక్కయీ, టెస్ట్, మన్నంగట్టి సిన్స్ 1960, డియర్ స్టూడెంట్స్, తని వరువన్ 2, గుడ్ బ్యాడ్ అగ్లీ, మూకుతి అమ్మన్ 2, టాక్సిక్ వంటి 8 చిత్రాల్లో నయన్ నటిస్తోంది.

# జ్యోతి పాప హై గ్లామర్ డోస్.. స్టన్నింగ్!

గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి పరిచయం అయిన కన్నడ నటి జ్యోతి పూర్వజ్. జ్యోతి రాయ్ పేరుతో నటిగా అరంగేట్రం చేసిన ఈ బ్యూటీ సీరియల్ లో హీరో తల్లి పాత్రలో నటించింది. తరువాత ఈ సీరియల్ లో తన పాత్ర కంప్లీట్ అయ్యాక పూర్తిస్థాయిలో గ్లామర్ వైపు ఫోకస్ చేసింది. యంగ్ డైరెక్టర్ సుకు పూర్వజ్ ని వివాహం చేసుకున్న జ్యోతి రాయ్ తన పేరుని కూడా మార్చుకుంది. ప్రస్తుతం సుకు పూర్వజ్ దర్శకత్వంలోనే 'ఏ మాస్టర్ పీస్' అనే సూపర్ హీరో చిత్రంలో జ్యోతి పూర్వజ్ నటించింది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే భర్త సుకు దర్శకత్వంలో రీసెంట్ గా 'కిల్లర్' అనే సినిమాకి ఆమె సైన్ చేసింది. దాంతో పాటు మరో సినిమా కూడా ఆమె చేతిలో ఉంది. ఇలా మూడు, నాలుగు సినిమాలకి జ్యోతి పూర్వజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ నిర్మాణ



దశలో ఉన్నాయి. ఇదిలా ఉంటే జ్యోతి పూర్వజ్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో జ్యోతి షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. రెగ్యులర్ గా జిమ్ లో వర్క్ అవుట్ లు చేస్తూ పర్ఫెక్ట్ లుక్ తో తన అందాన్ని జ్యోతి పూర్వజ్ మార్చుకుంటుంది. ఆమె అందం, ఆకర్షణతో ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ కారణంగానే జ్యోతి పూర్వజ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంటుంది. ఇక ఈ అమ్మడు ఫోటోలు కొన్ని ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. మంత్రముగ్ధులని చేసే అందంతో ప్రకాశవంతంగా మెరిసిపోతుంది. ప్రతి హృదయాన్ని ఆమె గ్లామర్ ఇట్టే ఆకర్షిస్తుంది. స్వచ్ఛమైన గ్లామర్ కి చిరునామాగా జ్యోతి పూర్వజ్ ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రోజు రోజుకి ఆమె అందంలో స్టార్ హీరోయిన్స్ కి పోటీ ఇస్తుందని ఫ్యాన్స్ అంటున్నారు. సరైన బ్రేక్ దొరికితే టాలీవుడ్ లో లేడీ సూపర్ స్టార్ గా మారే సత్తా జ్యోతి పూర్వజ్ కి ఉందని కామెంట్స్ చేస్తున్నారు.



# పిల్లలు చనిపోతే కానీ స్పందించరా?

## అధికారులు నిద్రపోతున్నారా?: మాగనూర్ ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్: నారాయణపేట జిల్లా మాగనూర్ జడ్పీ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

అధికారులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించింది. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ చాలా తీవ్రమైన అంశమని హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. "వారంలో మూడుసార్లు భోజనం వికటిస్తే అధికారులకు ఏం చేస్తున్నారు? పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా?అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు"అని హైకోర్టు ఆక్షేపించింది. వారంలో కౌంటర్ వేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాగనూర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది అస్వస్థతకు గురై వారం రోజులు కాకుండానే.. అదే పాఠశాలలో మళ్లీ 29 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. మంగళవారం మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల ఇళ్లకు తిరిగి వెళ్తున్న సమయంలో వాంతులు చేసుకున్నారు.

ఉపాధ్యాయులు వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. 29 మందిలో ఏడుగురు వెంటనే కోలుకోగా.. మిగిలిన 22 మందిని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






# పార్లమెంటులో మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ప్రస్తావన

ఢిల్లీ: పార్లమెంటులో మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ప్రస్తావన వచ్చింది. నదీ పునర్జీవనం కోసమే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున కూల్చివేతలు ఉండవని రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. పెద్దఎత్తున ప్రజలను నిరాశ్రయులు చేయమని కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని అన్నారు. అవసరం మేరకు మాత్రమే తొలగింపులు తరలింపు చేస్తామని పేర్కొంది. తొలగింపులు, తరలింపులు చెస్తే బాధిత కుటుంబాలకు తగిన విధంగా సహాయ పునరావాస చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నదీ పునర్జీవనం కోసం భూసేకరణకు, భూములు కోల్పోయే బాధిత కుటుంబాలకు విషయంలో సంబంధిత చట్టాల ప్రకారం ముందుకు వెళ్తామని కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ నదీ గర్భం నుంచి, బఫర్ జోన్ నుంచి తరలించే వారికోసం మానవతా దృక్పథంతో 15 వేల ఇళ్లను కేటాయించినట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నదీ పునర్జీవం, కాలుష్య నివారణ , వరదల బారి నుంచి కాపాడేందుకే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. బాధిత కుటుంబాల కోసం వారి జీవన ప్రమాణాలకు మద్దతు కోసం ఒక కమిటీని కూడా నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ప్రజల నుంచి వస్తున్న ఆందోళనలు గురించి రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి ప్రస్తావించారు. సురేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు వివరాలు వెల్లడించారు.

**మూసీ ప్రాజెక్టుపై అధికార యంత్రాంగం సన్నాహాలు...** కాగా.. రాష్ట్ర ప్రభుత్వానికి మానస పుత్రిక మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టును త్వరలోనే పట్టాలెక్కించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను త్వరలోనే తొలగించనున్నారు. దీనిపై మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌ఎఫ్‌డీసీఎల్) సన్నాహాలు చేస్తోంది. ఈ తొలగింపులో సర్వం కోల్పోయే కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సంబంధిత కుటుంబాల జాబితాను కొద్ది రోజుల్లో ప్రకటించనున్నారు. మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉంది. మొదటి దశలో మూసీ ప్రవహిస్తున్న ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తారు. అంటే దీని పరిధిలో ప్రస్తుతం నదీగర్భం.. మూసీకి అటూ ఇటూ ఉన్న ప్రాంతం (కట్టలు) మాత్రమే వస్తాయి. రెండో దశలో మూసీ నదికి అటూ ఇటూ 50 మీటర్ల పరిధిలోని బఫర్‌జోన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు. అయితే డీపీఆర్‌ను మాత్రం ఒకే ప్రాజెక్టు కింద రూపొందిస్తారు. పనులు నిరంతరాయంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగేందుకే ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తిచేయాలని సర్కారు ఆలోచిస్తున్నట్లు సమాచారం. అందునా.. మొదటి దశ పనులు మొదలుపెట్టిన కొద్దిరోజులకే రెండోదశకు అవసరమైన కార్యాచరణ మొదలు పెడతారని సమాచారం. మూసీ నది గర్భంలో కొన్ని ఇళ్లే ఉండటం, బఫర్‌జోన్ పరి?ధికొచ్చేసరికి ఎక్కువ ఇళ్లు ఉండటమూ రెండు దశల్లో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రధాన కారణం అన్న భావన వ్యక్తమవుతోంది. మూసీ నది గర్భంలో ప్రభుత్వం గుర్తించిన దాని ప్రకారం 1600 ఇళ్లు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో చాలామందిని ఇప్పటికే ఖాళీ చేయించి అక్కడి నుంచి తరలించారు. ఫలితంగా ప్రాజెక్టు తొలి దశను త్వరితగతిన ప్రారంభించుకునేందుకు వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బఫర్‌జోన్‌తో కలుపుకొంటే సుమారు 13వేల మంది వరకు ఇళ్లను కోల్పోతున్నారని అంచనా వేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో కూడా చర్చించారని సమాచారం. కాగా ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏడాదిన్నర సమయం పడుతుందని... మొత్తం ప్రాజెక్టును ఆరేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో ప్రస్తుతం మూసీకి అటూ ఇటూ రిటెయినింగ్ వాల్ నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. వాల్ మధ్యలో ఉన్న మూసీ నదిని శుద్ధి చేసి.. అటూ ఇటూ కట్టలను సుందరీకరణ చేయాలని భావిస్తోంది. ఇక బఫర్‌జోన్‌లో మూసీ నది వెంబడి 55 కిలోమీటర్ల మేర రెండు వైపులా విశాలమైన రహదారిని నిర్మిస్తారు. అటూ ఇటూ రహదారుల ప్రక్కన ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు.

# ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు: వెదిరె శ్రీరామ్



హైదరాబాద్: అవసరమైన పరీక్షలు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం వివరాలు అందించకపోవడం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆలస్యం అవుతోందని కేంద్ర జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరైన ఆయన.. కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ సమర్పించారు. గతంలో కమిషన్‌కు చెప్పిన అంశాలను ఇవాళ అఫిడవిట్ రూపంలో అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక మొదలు మేడిగడ్డ ఆనకట్ట పియర్స్ కుంగడం వరకు అన్ని అంశాలను అఫిడవిట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఇటీవలి పరిణామాలను సైతం అఫిడవిట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నట్లు. "ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక అంశంపై అఫిడవిట్‌లో ప్రస్తావించా. నివేదిక ఆలస్యానికి గల కారణాలను కమిషన్‌కు వివరించాను. ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పూర్తి చేయలేదు. ఎన్డీఎస్ఏ సిఫారసు చేయనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఇంజినీర్లు బ్యారేజీ కింద ఉన్న గుంతలను పూడ్చివేశారు. దాంతో బ్యారేజీల కింద జియో టెక్నికల్ డేటాను కోల్పోయాం. ఇదే విషయాన్ని ఎన్డీఎస్ఏ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. జియో టెక్నికల్ పరీక్షలు ఇక సాధ్యం కాదని.. కొన్ని చోట్ల జియో ఫిజికల్ పరీక్షలు చేసి వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఎన్డీఎస్ఏకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి డేటా అందలేదని, డేటా అందిన తర్వాత రెండు నెలలకు నివేదిక ఇస్తామని ఎన్డీఎస్ఏ తెలిపింది" అని వెదిరె శ్రీరాం పేర్కొన్నారు.

# ఏడాది పాలనపై కాంగ్రెస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధమా?: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్: కాంగ్రెస్ పాలన తీరు, తీసుకుంటున్న నిర్ణయాలు భారాస అడుగుజాడల్లోనే వెళ్తున్నట్లు కనిపిస్తోందని భాజపా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస సకల జనుల సర్వే అంటే.. కాంగ్రెస్ సమగ్ర కుల గణన అంటోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులను జైలుకు పంపుతామన్నారని.. ఏమైందని ప్రశ్నించారు. అప్పులు తేవడంలో భారాస పంథాలోనే కాంగ్రెస్ సర్కారు పయనిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ మూసీ ప్రణాళికనే.. ప్రస్తుత సర్కార్ అమలు చేస్తోందని చెప్పారు. "భారాస తరహాలోనే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోంది. రెండు పార్టీల నాటకాలను బట్టబయలు చేస్తాం. అక్రమ నిర్మాణం పేరుతో అయ్యప్ప సొసైటీ కట్టడాలను కేసీఆర్ ప్రభుత్వం వేగంగా కూల్చేసింది. ఆ తర్వాత అన్నీ సక్రమం అయిపోయాయి. రేవంత్‌రెడ్డి కూడా హైడ్రా పేరుతో అక్రమ నిర్మాణాలను కూల్చుతామంటున్నారు. రాహుల్ గాంధీకి ఎడమ కన్ను కేసీఆర్, కుడి కన్ను రేవంత్ రెడ్డి. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన వంద కోట్లను తిరస్కరించిన సీఎం.. కాళేశ్వరం కొట్టుకుపోవడానికి కారణమైన గుత్తేదారు విరాళాలు ఎందుకు తిరిగి ఇవ్వలేదు?. 6 మోసాలు.. 66 అబద్ధాలతో టైంపాస్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. ఇందిరమ్మ రాజ్యం అంటే దోచుకోవడం, దాచుకోవడమా?. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు పెరిగాయి. ఏడాది పరిపాలనపై కాంగ్రెస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధమా?" అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు.



# వీహెచ్ కారుపై దాడి..

## కాంగ్రెస్ సీనియర్ నేత కారుపై గుర్తుతెలియని దుండగులు దాడి..

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి వి.హనుమంతరావు(వీహెచ్) కారుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. ఇవాళ (బుధవారం) తెల్లవారుజామున 4 గంటల సమయంలో హైదరాబాద్ అంబర్‌పేటలోని తన ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కారును గుర్తుతెలియని వాహనంతో ఢీకొట్టినట్లు వీహెచ్ తెలిపారు. అనంతరం దాడి చేసిన వ్యక్తులు పారిపోయినట్లు ఆయన చెప్పారు. తనపై ఇలా దాడి జరగడం రెండోసారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దాడి గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు.

ఇంటి ఎదుట పార్క్ చేసిన కారును దుండగులు మరో వాహనంతో ఢీకొట్టి పారిపోయారని పోలీసులకు వీహెచ్ తెలిపారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. దాడి వెనక కారణాలను సైతం కనుగొనాలని వీహెచ్ కోరారు. అనంతరం దాడికి గురైన కారును పోలీసులు పరిశీలించారు. చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి వీహెచ్‌కు చెప్పారు. కాగా, వి.హనుమంతరావు కారుపై గతంలోనూ దాడి జరిగింది. 14, ఏప్రిల్ 2022న అర్ధరాత్రి సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి వీహెచ్ కారుపై దాడి చేశాడు.

ఇనుప రాడ్డుతో అద్దాలు ధ్వంసం చేశాడు. అనంతరం అక్కడ్నుంచి పారిపోయాడు. వీహెచ్ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం బరేలీకి చెందిన వికాస్‌సింగ్‌గా గుర్తించి అరెస్టు చేశారు.

# భారాస కాజేసిన భూముల వివరాలు బయటకు తీస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని భారాస నేతలు వేలాది ఎకరాల భూమిని కాజేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. భారాస కాజేసిన భూముల వివరాలు బయటకు తీస్తామని స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. మంత్రివర్గ విస్తరణపై పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. పసలేని విమర్శలతో ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు.

అభివృద్ధి చూసి ఓర్వలేక కొందరు కాకుల్లా అరుస్తున్నారు. హైడ్రా, మూసీ విషయంలో ఆలోచన చేశాకే ముందుకు పోతున్నాం. మూసీ విషయంలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.

మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.



# రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోంది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమిటని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప కాంగ్రెస్ సాధించిందేమీ లేదన్నారు. "సమస్యలపై మాట్లాడితే నా డీఎన్ఏ ఏంటని మాట్లాడుతున్నారు.. నాది భారతీయ జనతా పార్టీ డీఎన్ఏ. మిగతావారి మాదిరిగా పది పార్టీలు తిరిగిన డీఎన్ఏ కాదు. డిసెంబరు 1 నుంచి 5 వరకు కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం. ఇప్పటికైనా నిర్మాణాత్మకంగా పాలనపై కాంగ్రెస్ దృష్టి పెట్టాలి. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతో తెలంగాణ నష్టపోతోంది. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోంది. భారాస, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు? : కేటీఆర్

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కారు. వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. వృద్ధుల ఆందోళనపై 'నమస్తే'లో ప్రచురితమైన కథనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు స్పందించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు



ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

# ప్రజలు తిరగబడతారని ప్రభుత్వ పెద్దల్లో వణుకు : ఎమ్మెల్సీ కవిత

తాము చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారని.. ప్రభుత్వ పెద్దల్లో వణుకు పడుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర?త్వమన్నారు.

# మక్తల్‌లో పోలీసుల అత్యుత్సాహం.. మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్

మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనకు వెళ్తారనే అనుమానంతో బుధవారం తెల్లవారు జామున మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన నేతలను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు నారాయణపేట పోలీసులు తరలించారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫాయిజన్‌తో విద్యార్థులు అవస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు.

అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి.. ఠాణాకు తరలించారు. పోలీసుల అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com